వెలుగుల కొండ



విద్యుద్దీప కాంతులతో గురువారం రాత్రి తిరుమల కొండ వెలుగులీనింది. అక్టోబరు 4 నుంచి 12వరకు జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్తు అలంకరణలు చేపట్టారు. వీటిని పరిశీలించడానికి దీపాలు వేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీహరి రథాల ట్రయల్‌రన్



తిరుమల బ్రహ్మోత్సవాల్లో వినియోగించే స్వర్ణరథం, మహారథం పనితీరును టీటీడీ శుక్రవారం ప్రయోగాత్మకంగా పరిశీలించింది. వచ్చేనెల 9న స్వర్ణరథం.. 11న మహారథం(చెక్కతేరు)లో ఉత్సవర్లను ఊరేగించనున్నారు. ఈ క్రమంలో వీటిని మాడవీధుల్లో భక్తులు, ఉద్యోగులతో లాగించారు. రెండు రథాలు సవ్యంగానే ముందుకు సాగాయి. గుర్తించిన చిన్నపాటి లోటుపాట్లను సవరించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



స్వర్ణరథం, మహారథం

జగన్ పర్యటన రద్దు

● **ఊపిరి పీల్చుకున్న పోలీసులు**

తిరుపతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వాడకం.. తిరుమల పవిత్రతను దెబ్బతీశారంటూ గత వైసీపీ ప్రభుత్వంపై కూటమి పార్టీలు, హిందూ సంఘాల ఆగ్రహం. మాజీ సీఎం జగన్ తిరుమల పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరికలు. 'డిక్లరేషన్'పై సంతకం చేయాల్సిందేనంటూ డిమాండు. దీంతో గురువారం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు తిరుపతిలో టెన్షన్ నెలకొంది. పోలీసులూ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. చివరకు జగన్ తన పర్యటనను రద్దు చేసుకోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యిలో తీవ్ర అభ్యంతరకర పదార్థాల కల్తీ జరిగిందన్న ఆరోపణలతో మాజీ సీఎం జగన్ ఆత్మరక్షణలో పడ్డారు. దాన్నుంచి బయట పడే ప్రయత్నాల్లో భాగంగా శుక్ర, శనివారాల్లో తిరుమల పర్యటన తలపెట్టారు. కూటమి పార్టీల శ్రేణులు, హిందూ సంఘాలూ తీవ్ర ఆగ్రహంతో వున్న నేపథ్యంలో జగన్ పర్యటనలో ఎక్కడ అవాంఛనీయ ఘటనలు జరుగుతాయోనని పోలీసు యంత్రాంగం ఆందోళనకు గురైంది. జిల్లావ్యాప్తంగా శుక్ర, శనివారాల్లో పోలీస్ 30 యాక్ట్ అమలు చేస్తామంటూ గురువారమే ప్రకటించింది. అనుమతి లేకుండా సభలు, సమావేశాలూ, ర్యాలీలూ జరపరాదని హెచ్చరించింది. శుక్రవారం ఉదయం నుంచే జిల్లాలో సుమారు 283 మంది వివిధ స్థాయిల్లోని వైసీపీ నాయకులకు పోలీసులు నోటీసులు ఇచ్చారు.



విమానాశ్రయం వద్ద పోలీసుల తనిఖీలు

మధ్యాహ్నం 2 గంటలకల్లా సుమారు 500 మంది పోలీసులు విమానాశ్రయం వద్ద మొహరించారు. తిరుపతి నగరం అలిపిరి వద్దా 200 మందికిపైగా పోలీసులు చేరుకున్నారు. తిరుమలలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. విమానాశ్రయం నుంచి కాన్వాయ్‌లో ఎలాంటి హడావిడి లేకుండా తిరుమల వెళ్లేట్లయితే అనుమతించాలని పోలీసు అధికారులు భావించారు. అయితే మధ్యలో కూటమి పార్టీల శ్రేణులు, హిందూ సంఘాలు, లేదా భక్తులెవరైనా అడ్డుకోవడం, దాడి చేయడం వంటివి జరుగుతాయోమేనని పోలీసుల్లో ఆందోళన నెలకొంది. కానీ, 3 గంటలకల్లా జగన్ పర్యటన రద్దయినట్టు సమాచారం రావడంతో పోలీసు యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

వైసీపీ శ్రేణుల్లోనూ ఊరట

జగన్ పర్యటన ప్రకటనతో వైసీపీ శ్రేణుల్లోనూ తొలుత ఉత్కంఠ నెలకొంది. కూటమి పార్టీల శ్రేణులు లేదా హిందూ సంఘాలు లేదా శ్రీవారి భక్తులు కాన్వాయ్‌ని అడ్డుకోవడం, దాడి చేస్తాయేమోనని ఆందోళన చెందారు. కోడిగుడ్లు, టమోటాలు వంటివి విసిరినా తీవ్ర అవమానమే కదా అన్న ధోరణిలో వారు ఉత్కంఠకు లోనయ్యాయి. తీరా పర్యటన రద్దు కావడంతో ఊరట చెందారు.

పర్యటన ఎందుకు రద్దయినట్లో?

జగన్ తిరుమల పర్యటన నేపథ్యంలో ఏం జరుగుతుందోనన్న టెన్షన్ శుక్రవారం మధ్యాహ్నం దాకా నెలకొంది. ఆ తర్వాత జగన్ పర్యటన రద్దుకు కారణాలేంటనే చర్చ జనంలో జోరుగా నడిచింది. జగన్‌కు స్వాగతం, వీడ్కోలు పలికేందుకు గానీ, పర్యటనలో వెన్నంటి పాల్గొనేందుకు గానీ పార్టీ శ్రేణులు ఉత్సాహం చూపలేదన్న ప్రచారం జరుగుతోంది. ఒకవేళ పర్యటనకు వెళితే పోలీస్ 30 యాక్ట్ నిబంధనల ఉల్లంఘనల పేరిట కేసులు నమోదు చేస్తారన్న భయమూ శ్రేణులను నిరుత్సాహపరిచిందని చెబుతున్నారు. పార్టీ ముఖ్య నేతలూ పెద్దగా ఆసక్తి చూపలేదని సమాచారం. జనసమీకరణ చేసే పరిస్థితి లేదని గ్రహించిన నేతలు ఇదే విషయమై అధినేతకు ఫీడ్‌బ్యాక్ ఇచ్చారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దానికి తోడు అవమానకర ఘటనలు ఎదురు కావచ్చునన్న అనుమానాలూ పర్యటన రద్దుకు కారణమై ఉంటుందన్న ప్రచారం నడుస్తోంది. మరోవైపు తిరుమలలో శ్రీవారి దర్శనానికి వెళ్లేముందు డిక్లరేషన్ ఇవ్వడంపై కూడా జగన్ సంకట స్థితిలో పడ్డారని, సంతకం చేస్తే క్రైస్తవుడినని ఒప్పుకున్నట్టు అవుతుందని, పెట్టకపోతే టీటీడీ యంత్రాంగం దర్శనానికి అనుమతించదేమోనన్న అనుమానం.. వెరసి పర్యటన రద్దు చేసుకున్నట్టు జనంలో చర్చ జరుగుతోంది.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు జీవీఆర్ విరాళం రూ.కోటి



కోట, సెప్టెంబరు 27: వరద బాధితుల సాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు కోట మండలం చిట్టేడులోని సాగర్‌గ్రంధి ఆక్వా ఎక్స్‌పోర్ట్ (జీవీఆర్) పరిశ్రమల తరఫున రూ.కోటి అందజేశారు. ఈ చెక్కును శుక్రవారం గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఆధ్వర్యంలో ఆ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు గ్రంధి బాలాజీ, గ్రంధి చల్లారావు వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడుకు ఇచ్చారు. వరద బాధితులను ఆదుకునేందుకు తమవంతు సాయంగా ఈ మొత్తం ఇచ్చినట్లు ఆ సంస్థ ఎండీలు తెలిపారు.

మున్సిపల్ మాజీ డీసీ
సస్పెన్షన్ కొనసాగింపు

తిరుపతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ పూర్వ డిప్యూటీ కమిషనర్ పి.చంద్రమౌళీశ్వర్‌రెడ్డి సస్పెన్షన్ కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సస్పెన్షన్ ఎత్తివేయాలంటూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ నిర్ణయంపై సమీక్షించాలని కోర్టు ఆదేశించింది. దీనిపై సమీక్షించిన ప్రభుత్వం సస్పెన్షన్‌ను కొనసాగించాలని నిర్ణయించింది. తిరుపతి ఎంపీ బల్లి దుర్గాప్రసాద్ మరణంతో 2021 మార్చిలో ఉప ఎన్నికలు జరిగాయి. పోలింగ్ రోజు దొంగ ఓటర్లు తిరుపతి వచ్చి ఓట్లు వేశారు. టీడీపీ, బీజేపీ నేతలు పలువురు దొంగ ఓటర్లను అడ్డుకుని, అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. తదుపరి ఎలాంటి చర్యలూ లేకపోవడంతో వారు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై 2023 చివర్లో ఎన్నికల కమిషన్ విచారణకు ఆదేశించింది. ఈ విచారణలో అనేక అంశాలు వెలుగుచూశాయి. ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ నుంచి అక్రమంగా వేలాది ఓటరు కార్డులను డౌన్‌లోడ్ చేసినట్టు తేలింది. అప్పటి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ పి.చంద్రమౌళీశ్వర్‌రెడ్డి తనకు తానుగా తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్వోగా ప్రకటించుకుని ఎన్నికల విధులు, కార్యకలాపాలు సాగించారని, ఆయనను ఈఆర్వోగా నియమిస్తూ ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఇవ్వలేదని విచారణలో తేలింది. ఈసీ ఆదేశాలతో చంద్రమౌళీశ్వర్‌రెడ్డిని ఫిబ్రవరి 9న ప్రభుత్వం సస్పెండు చేసింది. తనపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించమంటూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు చంద్రమౌళీశ్వర్‌రెడ్డి సస్పెన్షన్ నిర్ణయాన్ని సమీక్షించాలని గత జూలై 24న ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో రివ్యూ కమిటీ ఈనెల 17వ తేదీన సమావేశమై సస్పెన్షన్ నిర్ణయాన్ని సమీక్షించింది. ఆ సందర్భంగా చంద్రమౌళీశ్వర్‌రెడ్డిని ఈసీ ఆదేశాల మేరకు సస్పెండ్ చేయడం జరిగిందని కమిటీ గుర్తించింది. అతడిపై శాఖాపరమైన విచారణ చేపట్టడానికి అవసరమైన రికార్డులు ఈసీ నుంచీ ఇటీవలే వచ్చాయనీ గుర్తించింది. ఈ రెండు కారణాలతో పాటు ఆరోపణల తీవ్రత దృష్ట్యా చంద్రమౌళీశ్వర్‌రెడ్డి సస్పెన్షన్‌ను కొనసాగించాలని కమిటీ సిఫారసు చేసింది. దీంతో సస్పెన్షన్ కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు మున్సిపల్ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పర్యాటకంలో ఉత్తమం



చంద్రబాబు నుంచి అవార్డు స్వీకరిస్తున్న జిల్లా పర్యాటక ప్రాంతీయ సంచాలకుడు రమణకుమార్





తిరుపతి రైల్వే స్టేషన్ తరపున అవార్డు అందుకుంటున్న డైరెక్టర్ సత్యనారాయణ, తాజ్ తరపున హోటల్ ప్రతినిధి

తిరుపతికి ఉత్తమ జిల్లాతో పాటు మరో మూడు అవార్డులు

పర్యాటక దినోత్సవం సందర్భంగా సీఎంచే ప్రదానం

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 27: రాష్ట్ర పర్యాటక, ఆతిథ్య రంగం ప్రమోషన్‌లో భాగంగా తిరుపతికి ఉత్తమజిల్లా అవార్డు 2023-24 (అవార్డు ఆఫ్ ఎక్సలెన్స్) లభించింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ఈ అవార్డులను ప్రదానం చేశారు. కలెక్టర్ తరపున టూరిజం ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ రమణప్రసాద్ షీల్డ్, ప్రశంసాపత్రం అందుకున్నారు. అలాగే, ఉత్తమ ఫైవ్‌స్టార్‌హోటల్‌గా తాజ్‌హోటల్, టూరిస్ట్ ఫ్రెండ్లీ రైల్వే స్టేషనుగా తిరుపతి రైల్వేస్టేషన్, హ్యాండీక్రాఫ్ట్ ఉడ్ కార్వింగ్ మాధవమాలకు అవార్డు ఆఫ్ ఎక్సలెన్స్ లభించాయి. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' విలేకరిపై దాడి

● నిందితులపై కేసు నమోదు


దుండగుల దాడిలో ధ్వంసమైన కారు

భాకరాపేట, సెప్టెంబరు 27: ఎర్రావారిపాళెం ఆంధ్రజ్యోతి విలేకరి మల్లెల నీరజ, ఆమె భర్త సిద్దయ్యపై గురువారం రాత్రి దాడి జరిగింది. వీరి స్వగ్రామమైన చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ పంచాయతీ మల్లెలవాండ్లపల్లెలో.. అదే గ్రామానికి చెందిన కొందరు దాడికి పాల్పడ్డారు. బాధితురాలి కథనం మేరకు.. మల్లెలవాండ్లపల్లెకు చెందిన సింగంశెట్టి నారాయణ నెల కిందట తన భూమి పక్కనే వున్న ప్రభుత్వ భూమిని చదును చేస్తుండగా సర్పంచ్ విజయకుమార్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమవడంతో నీరజ కుటుంబీకులతో నారాయణ ఘర్షణ పడ్డారు. గ్రామ పెద్దలు జోక్యంచేసుకుని సర్దుబాటు చేశారు. ఇటీవల బాధితురాలి భూమిని ఆక్రమించేందుకు నారాయణ యత్నించడంతో మళ్ళీ గొడవ జరిగింది. తిరిగి గ్రామ పెద్దలు సర్దుబాటు చేశారు. నారాయణ కుమారుడు వెంకటరమణ తరచూ రాత్రిళ్ళు బాధిత మహిళకు ఫోన్ చేసి ఆమెను, ఆమె భర్తనూ చంపేస్తామంటూ బెదిరించారు. గురువారం రాత్రి నారాయణ కుమారుడు, అతని బావమరిది ప్రసాద్, మరికొందరు రౌడీలతో కలిసి బాధితురాలి ఇంట్లోకి చొరబడి కారును, ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశారు. అడ్డు వచ్చిన బాధితులపైనా దాడి చేశారు. దీనిపై పోలీసులకు మల్లెల నీరజ ఫిర్యాదు చేశారు. తమపై దాడి చేసిన వారితో పాటు దాడికి సహకరించిన నారాయణ భార్య చిన్నపాప అలియాస్ ఆదిలక్ష్మి, నారాయణ సోదరుడి కుమారుడు ఉమాపతిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ప్రసాద్‌పై తిరుపతిలో పలు కేసులున్నాయని, వారి నుంచి తన కుటుంబానికి ప్రాణహాని ఉందని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా భాకరాపేట పోలీసులు వెంకటరమణ, ప్రసాద్, నారాయణ, చిన్నపాప అలియాస్ ఆదిలక్ష్మి, ఉమాపతితోపాటు మరో ముగ్గురిపై సెక్షన్ 329(4), 115(2), 324(4), 351(2బి) రెడ్ విత్ 3(5) కింద కేసు నమోదు చేశారు.

సుధాకరప్రసాద్‌కు ఘన నివాళి



రామచంద్రాపురం, సెప్టెంబరు 27: ఆంధ్రప్రదేశ్ సర్వీసెస్ అసోసియేషన్ మాజీ జనరల్ సెక్రటరీ టి.సుధాకరప్రసాద్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం రెవెన్యూ ఉద్యోగులు నివాళి అర్పించారు. తహసీల్దారు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి తహసీల్దారు వెంకటరమణ పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ సుధాకరప్రసాద్ ఉద్యోగుల పక్షపాతి అని కొనియాడారు. కార్యక్రమంలో డీటీ అన్వర్‌బాషా, ఆర్ఐ కృష్ణమ్మ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, వీఆర్వోలు సతీష్, ప్రసాద్, బాబుఖాన్, ఝాన్సీ రాణి, సాయి, నాగజ్యోతి, వర్మ, కంప్యూటర్ ఆపరేటర్ రమాదేవి, గ్రామసేవకుల జిల్లా అధ్యక్షుడు గోవిందస్వామి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు


పీఎండీఎస్ మోడల్‌ను పరిశీలిస్తున్న మాలే ప్రతినిధులు

భాకరాపేట, సెప్టెంబరు 27: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగుచేస్తే నాణ్యమైన దిగుబడులు వస్తాయని మాలే ప్రతినిధుల బృందం అభిప్రాయపడింది.చిన్నగొట్టిగల్లు మండలం చట్టేవారిపాళెం పంచాయతీ బిల్లావాండ్లపల్లెకు చెందిన రైతు సుబ్రహ్మణ్యం పొలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలను ఆ బృందం పరిశీలించింది. పంటల సాగు, ద్రవ, ఘన జీవామృతాల తయారీ, ఏటీఎం, ఏ గ్రేడ్, పీఎండీఎస్ మోడళ్లను పరిశీలించారు. ఎంటీ సరస్వతి పండ్ల తోటలో వేసిన పీఎండీఎస్‌ను సందర్శించారు. ఎగ్ ఎమినో యాసిడ్ తయారీ గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇండో జర్మన్ అకాడమీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివారెడ్డి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం, సీనియర్ కన్సల్టెంట్ సురేందర్ రెడ్డి, జిల్లా కో-ఆర్డినేటర్ రవిచంద్ర ప్రసాద్, అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ సొహైల్, మాస్టర్ ట్రైనర్ సరస్వతి పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో మద్రాస్ హైకోర్టు సీజే


ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో న్యాయమూర్తి

తిరుచానూరు, సెప్టెంబరు 27: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని శుక్రవారం రాత్రి మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. జస్టిస్ కేఆర్ శ్రీరామ్ ముందుగా ధ్వజస్తంభానికి నమస్కరించి, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆయన్ను అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ ఏర్పాట్లలో రాజీ పడొద్దు



తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో ఎలాంటి రాజీ ఉండకూడదని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి శుక్రవారం ఆయన వివిధ విభాగాల అధికారులతో తిరుమలలోని అన్నమయ్య భవనంలో సమావేశమయ్యారు. అన్నప్రసాదం, పారిశుధ్యం విభాగాలు ఒకదానికిఒకటి సమన్వయం చేసుకుని అన్నప్రసాదం వడ్డించడం, పూర్తయిన వెంటనే చెత్తను తొలగించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఇంజినీరింగ్ పనులు, శ్రీవారి ఆలయం, విజిలెన్స్, ఫారెస్ట్, కళాబృందాల ప్రదర్శనలు, రవాణా, గోశాల, మెడికల్ విభాగాలను ఈవో పరిశీలించారు. ఈసమావేశంలో డీఎల్వో వరప్రసాద్, సీఈ సత్యనారాయణ, ఎఫ్ఏసీఏవో బాలాజీ, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలకు ఎంపిక


విద్యార్థులతో హెచ్ఎం వంశీరాజా, టీచర్లు

తిరుపతి రూరల్, సెప్టెంబరు 27 : ఎమ్మార్‌పల్లి జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అండర్-14, 17 విభాగంలో తిరుపతి నియోజకవర్గ స్థాయిలో బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. రాణించిన వారిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు స్కూల్ హెచ్ఎం వంశీరాజా తెలిపారు. కాగా శనివారం అండర్-14, 17 విభాగంలో వాలీబాల్, యోగా, చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులను ఆయనతో పాటు పీడీ వెంకటముని, కోఆర్డినేటర్లు శోభన్‌బాబు, నసీమ, పీఈటీలు, పీడీలు, టీచర్లు అభినందించారు.

ఏపీఎంగా నాగేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

తిరుపతి రూరల్, సెప్టెంబరు 27: తిరుపతి రూరల్ మండల వెలుగు మహిళా సమాఖ్య ఏపీఎంగా పత్తిపాటి నాగేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లా బ్యాంకు లింకేజ్ యాంకర్‌పర్సన్‌గా పనిచేసే ఈయన బదిలీపై ఇక్కడ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన పరశురామ్‌రెడ్డి బదిలీపై వెదురుకుప్పానికి వెళ్లారు.

వెలుగు ఏపీఎంగా గురుమూర్తి

రామచంద్రాపురం, సెప్టెంబరు 27: మండల వెలుగు ఏపీఎంగా గురుమూర్తి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తొట్టంబేడు ఏపీఎంగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసే రాగమ్మ తిరుపతి కేంద్ర కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. వెలుగు మండల కో-ఆర్డినేటర్లుగా సుధాకర్, పార్వతి, అరుణ బాధ్యతలు స్వీకరించారు.

త్వరలో సనాతన ధర్మపరిరక్షణ బోర్డు ఏర్పాటు

సేవ్ తిరుమల సేవ్ టీటీడీ అంటూ స్వామిని వేడుకుంటున్న నేతలు, స్వామీజీలు



తిరుపతి అర్బన్, సెప్టెంబరు 27: త్వరలో సనాతన ధర్మపరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ తెలిపారు. తిరుపతిలో శుక్రవారం ఉదయం సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు విషయమై నేతలు, స్వాములు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. హిందువుల మనోభావాలు దెబ్బతినకుండా, హిందుత్వాన్ని కాపాడేందుకు ప్రత్యేక బోర్డు ఉండాల్న పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలను గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తులో హిందువులకు ఏం జరిగినా ఆ బోర్డు ద్వారా తగిన నిర్ణయాలు తీసుకునేందుకు వీలుంటుందన్నారు. జగన్ డిక్లరేషన్ విషయం టీటీడీ చూసుకుంటుందని కిరణ్‌రాయల్ అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు, రాజకీయ లబ్ధి కోసమే జగన్ తిరుమల పర్యటనను ఎంచుకొన్నారని విమర్శించారు. గత ఐదేళ్లలో తిరుమల పవిత్రతను కాపాడని జగన్‌కు, క్షేత్రప్రాశస్త్యం పట్ల గౌరవం లేదని శ్రీనివాసానంద సరస్వతి ఆవేదన వ్యక్తం చేశారు. డిక్లరేషన్ ఇవ్వకుండానే స్వామికి పట్టువస్త్రాలు సమర్పించడం అపచారమన్నారు. రెచ్చగొట్టే మాటలు మానేస్తే మంచిదని కరుణాకర్‌రెడ్డికి సూచించారు. విద్యాసాగర్, స్వామి జ్యోతి స్వరూపనందస్వామి, త్యాగరాజనందస్వామి, దయానందదత్త స్వామి, రామానుజస్వామి, నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

డిక్లరేషన్‌పై సంతకం పెట్టలేకే..

● జగన్ పర్యటన రద్దుపై బీజేపీ నేత భానుప్రకాష్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), సెప్టెంబరు 27: శ్రీ వేంకటేశ్వర స్వామిపై విశ్వాసం ఉందని డిక్లరేషన్ ఇవ్వలేకనే జగన్ తిరుమల పర్యటన రద్దు చేసుకున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీకి కారణమైన జగన్‌ను తిరుమలకు రాకుండా అడ్డుకునేందుకు తమ పార్టీ సన్నద్ధమైందన్నారు. ఈ క్రమంలో జగన్ డిక్లరేషన్‌పై సంతకం పెట్టకుంటే తిరుమలకు అనుమతించొద్దని ఈవోకు వినతి పత్రం కూడా ఇచ్చామని వెల్లడించారు. రాష్ట్ర ప్రజలకు, హిందూ సమాజానికి, సాధు పుంగవులకు సమాధానం చెప్పలేకే జగన్ పర్యటనను రద్దుచేసుకున్నారని విమర్శించారు. జగన్ అధికారంలో ఉన్న ఐదేళ్లు డిక్లరేషన్‌పై ఎందుకు సంతకం పెట్టలేదో ఛైర్మన్లుగా పనిచేసిన వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుమలకు జగన్ ఎప్పుడొచ్చినా డిక్లరేషన్‌పై సంతకం పెట్టాల్సిందేనన్నారు.

ధర్మారెడ్డి ఆచూకీ తెలపండి


● రూ.1,116 బహుమతి ఇస్తామన్న నవీన్



తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 27: టీటీడీలో ఐదేళ్లపాటు సకల శాఖల అధికారిగా పెత్తనం చెలాయించిన 'ధర్మారెడ్డి' ఆచూకీ తెలిపినవారికి రూ.1,116 బహుమానం ఇస్తామని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ప్రకటించారు. శ్రీవారి లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి వాడకంపై భక్తులు నిరసన చెబుతుంటే.. గత సీఎం నుంచి పూర్వ టీటీడీ ఈవోలు, ఉన్నతాధికారులు వివరణలు ఇస్తుంటే.. వీటికి మూలకారకులైన జవహర్‌రెడ్డి, ధర్మారెడ్డి మాత్రం ఎక్కడ దాక్కున్నారంటూ భక్తులు ప్రశ్నిస్తున్నారన్నారు. తిరుమలలో అన్యమతస్థులు డిక్లరేషన్ ఇచ్చినంత మాత్రాన హిందువుగామారరని జగన్ గ్రహించాలన్నారు. శ్రీవారి దర్శనానికి వెళ్లే ముందు జగన్ తిరుమల ఆచారాలకు కట్టుబడి డిక్లరేషన్ చేసేలా ఆయనకు వేంకటేశ్వరస్వామి మంచి బుద్ధి ప్రసాదించాలన్నారు.

కల్తీనెయ్యి ప్రకటనను కప్పిపుచ్చుకునేందుకే..

● నోటీసులపేరిట కుట్ర చేస్తున్నారన్న చెవిరెడ్డి



తిరుపతిరూరల్, సెప్టెంబరు27: శ్రీవారి లడ్డూలో కల్తీనెయ్యి వాడారన్న తప్పుడు ప్రకటనను కప్పిపుచ్చుకునేందుకు జగన్‌కి శ్రీవారి దర్శనానికి అనుమతిలేదని ప్రభుత్వం నోటీసులు ఇవ్వడాన్ని కుట్రగా భావించాల్సివస్తోందని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆరోపించారు. తుమ్మలగుంటలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ తిరుమల పర్యటన సందర్భంగా ప్రభుత్వమే శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించడం దారుణమన్నారు. సీఎంగా ఐదుసార్లు పట్టువస్త్రాలు సమర్పించిన జగన్.. ఇప్పుడు శ్రీవారి దర్శనానికి రావాలంటే అనుమతులు తీసుకోవాలా.. ఇదెక్కడి న్యాయమంటూ అసహనం వ్యక్తం చేశారు. తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.



బీజేపీ గుర్తిస్తేనే హిందువులవుతారా?: భూమన

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 27: బీజేపీ నాయకులు గుర్తిస్తేనే హిందువులవుతారా అని టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. తిరుపతిలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సనాతన ధర్మం అంటే ఏమిటో తెలియని వారు కూడా హిందుత్వం గురించి మాట్లాడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి హోదాలో బ్రహ్మోత్సవాలప్పుడు స్వామికి జగన్ పట్టువస్త్రాలు సమర్పించారని, ఇన్నిసార్లు తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తర్వాత కూడా డిక్లరేషన్‌పై సంతకం ఎందుకు పెట్టాలంటూ ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఎంపీ గురుమూర్తి, మేయర్ డాక్టర్ శిరీష, మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, బొమ్మగుంట రవి, తలారి రాజేంద్ర పాల్గొన్నారు.

54 ఏళ్ల తర్వాత అ'పూర్వ' కలయిక


పాఠశాల భవనం ఎదుట పూర్వవిద్యార్థులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 27: ఎక్కడి నుంచో వచ్చారు. బడిలో కలిశారు. మిత్రులయ్యారు. చదువుతో పాటు ఆట పాటలతో గడిపారా పిల్లలు. అదంతా 54 ఏళ్ల కిందటి విషయం. ఇప్పుడు వారంతా అవ్వా తాతలు. జీవితపు అనుభవాలతో తలపండిన అనుభవజ్ఞులు. వివిధ రంగాల్లో స్థిరపడి.. విశ్రాంత జీవితం గడుపుతున్న వారు. వీరంతా 'ఆత్మీయ సమ్మేళనం' పేరిట నాడు తాము చదువుకున్న బడికి వచ్చారు. ఇప్పుడది జిల్లా పోలీసు కార్యాలయం. ఆ కార్యాలయ ఆవరణలో తిరుగుతూ.. పాఠశాలగా ఉన్నప్పుడు ఎక్కడెక్కడ తిరిగిందీ గుర్తు చేసుకున్నారు. ఫొటోలు తీసుకున్నారు. ఆనందంగా కలియతిరిగారు.

చాలా గర్వకారణం



ఇంటర్మీడియట్ కోర్సు ప్రారంభం కాకముందు హయ్యర్ సెకండరీ స్కూల్లో 11, 12 తరగతులు ఉండేవి. ఈ పిల్లలు చివరి బ్యాచ్ విద్యార్థులు. గురువులంటే ఎనలేని భయభక్తులు ఉండేవి. వీరంతా ఉన్నత చదువులు చదివారు. ఉన్నత పదవుల్లో పనిచేశారు. ఇప్పటికీ వారి ఆప్యాయతలు పోగొట్టుకోకపోవడం నాకు చాలా గర్వకారణంగా ఉంది. మళ్లీ ఇన్నేళ్లకు వీరితో గడిపే అవకాశం చాలా బాగుంది.

- యాకూబ్ హుస్సేన్, హిందీ ఉపాధ్యాయుడు

బంగారు బాట వేసిన బడి



నేను డీఆర్‌డీఏలో సైంటిస్ట్‌గా బ్రహ్మోస్ మిస్సైల్ ప్రాజెక్ట్‌లో పనిచేశాను. హెవీ వెయిట్ టార్పెడో అండర్ వాటర్ మిస్సైల్ మొదటి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేశా. దానిని డిజైన్ చేసే అదృష్టం నాకు కలగడం అదృష్టం. అబ్దుల్ కలాం ఆధ్వర్యంలో క్షిపణి అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకున్నా. నేను ఈ స్థాయికి చేరడం వెనక.. ఉపాధ్యాయుల శిక్షణ, నేర్పిన క్రమశిక్షణ ఉంది. మా జీవితాలకు ఎస్వీ హయ్యర్ సెకండరీ పాఠశాల బంగారు బాటలు వేసింది.

- ఎస్.వి.రంగరాజన్, డీఆర్‌డీఏ విశ్రాంత సైంటిస్ట్

జీవిత పాఠాలూ నేర్పారు



పాఠాలేకాదు.. జీవిత పాఠాలనూ మా ఉపాధ్యాయులు బోధించారు. వారు నేర్పించిన విషయాలు నా జీవితంలో ప్రతి అంశంలోనూ ఉపయోగపడ్డాయి. వారిని ఆదర్శంగా తీసుకున్నందునే నేను ఉపాధ్యాయురాలిని కావాలని లక్ష్యంగా పెట్టుకుని సాధించా. హైదరాబాద్ గోల్కొండ కేంద్రీయ విద్యాలయం వైస్ ప్రిన్సిపల్‌గా రిటైరయ్యా. మా స్నేహితులందరినీ కలవడం సంతోషంగా ఉంది.

- విజయలక్ష్మి, కేంద్రీయ విద్యాలయ విశ్రాంత వైస్ ప్రిన్సిపల్



చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నాం:

మా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నాం. ఇప్పటి పరిస్థితులుకూడా చెప్పుకున్నాం. ఒక్క మాటలో చెప్పాలంటే బాధలు, బయట ప్రపంచాన్ని మరిచ్చిపోయి ఈ రోజంతా స్నేహితులతోనే గడిపాం. మళ్లీ మళ్లీ కలుస్తాం.

- దేవరాజన్, విశ్రాంత జర్నలిస్ట్

జగన్ కొత్త కుట్రకు తెరలేపుతున్నారు: నాని

తిరుచానూరు, సెప్టెంబరు 27: మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి తిరుమల శ్రీవారి లడ్డూను అపవిత్రం చేయడమే కాకుండా ప్రస్తుతం కొత్త కుట్రకు తెరలేపుతున్నారని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆరోపించారు. స్వామివారి దర్శనం పేరు చెప్పి వైసీపీ నాయకులు, రౌడీలను పోగేసి తిరుపతి, తిరుమలలో అల్లర్లు సృష్టించే ఆలోచనలో ఉన్నారని పేర్కొన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సబ్ రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ

చంద్రగిరి, సెప్టెంబరు 27: చంద్రగిరి సబ్ రిజిస్ట్రార్‌గా కొండారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలలో భాగంగా శ్రీకాళహస్తి నుంచి ఈయన బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మోహన్‌బాబు నగరికి బదిలీ అయ్యారు. కొండారెడ్డిని డాక్యుమెంట్ రైటర్లు సన్మానించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.84 కోట్లు

తిరుమల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.84 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ఉదయం ప్రకటించింది.ఇక, గురువారం 61,328 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,033 మంది తలనీలాలు సమర్పించారు.

ముగిసిన అల్లా జెండా ఊరేగింపు


గంగిరెడ్డిపల్లిలో ఊరేగుతున్న అల్లా జెండా

రామచంద్రాపురం,సెప్టెంబరు27: మండలంలోని గంగిరెడ్డిపల్లిలో 9 రోజులుగా నిర్వహిస్తున్న అల్లా జెండా ఊరేగింపు శుక్రవారంతో ముగిసింది.మసీదు వద్ద ప్రార్థనల అనంతరం రాత్రి జెండాలను అలంకరించి, గ్రామంలో ఊరేగించారు. గ్రామస్థులు మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి మసీదు వద్ద అన్నదానం చేశారు.

తిరుచ్చిపై సిరుల తల్లి సాక్షాత్కారం



తిరుచానూరు, సెప్టెంబరు 27: తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారు శుక్రవారం రాత్రి బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. వేకువజామున సుప్రభాత సేవతో అర్చకులు అమ్మవారిని మేల్కొపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మూలమూర్తికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీపూజ నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తిని ఫ్రైడే గార్డెన్‌కు వేంచేపు చేసి, తిరుమంజనం నిర్వహించారు. అలంకార శోభితురాలైన పద్మావతిదేవికి తిరువీధి ఉత్సవం వేడుకగా చేశారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్ పాల్గొన్నారు.

గంజాయి బ్యాచ్ ఆగడాలు అరికట్టండి


గ్రామసభలో సమస్యలు వివరిస్తున్న స్థానికులు

తిరుపతి రూరల్, సెప్టెంబరు 27: గంజాయి తాగి రాత్రి సమయాల్లో హల్‌చల్ చేస్తున్న ఆకతాయిలను కట్టడి చేయాలని పలువురు మహిళలు కోరారు. తిరుపతి రూరల్ మండలం లింగేశ్వర్‌నగర్ పంచాయతీలో స్వచ్ఛతా హి సేవ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం సర్పంచ్ కోటేశ్వరరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. మహిళలు మాట్లాడుతూ యువకులు గంజాయి తాగి రాత్రి సమయాల్లో వీధుల్లో తిరుగుతున్నారని, పోలీసులు గస్తీ మరింతగా పెంచి వారిపై చర్యలు చేపట్టాలని కోరారు. వీధి కుక్కల బెడద తగ్గించాలని కోరారు. సర్పంచ్ మాట్లాడుతూ చెత్తను పారిశుధ్య సిబ్బందికి మాత్రమే అందించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి విజయనిర్మల, టీడీపీ నేత హేమలత, బిల్ కలెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు


ఆలయం వద్ద బీజేపీ నాయకురాలు మాధవీలత


ఆలయం వద్ద జస్టిస్ బి.కృష్ణమోహన్

తిరుచానూరు, సెప్టెంబరు 27: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇందులో తెలంగాణ బీజేపీ నాయకురాలు మాధవీలత, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ ఉన్నారు. వారికి ఆలయాధికారులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్ పాల్గొన్నారు.

తప్పుడు దండోరా!

● ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా వైసీపీ నేత స్కెచ్ వేశారని అనుమానం
● ముందుగానే గ్రామసభను బహిష్కరించిన టీడీపీ శ్రేణులు


సురుటుపల్లెలో ఏడెనిమిది మందితో జరిగిన గ్రామ సభ

నాగలాపురం, సెప్టెంబరు 27: 'యావన్మందికి తెలియజేయడం ఏమనగా.. శుక్రవారం జరిగే గ్రామ సభలో కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇంటి పట్టాలు, ఆధార్ కార్డులు ఇవ్వనున్నారహో.. అవసరమైన వాళ్లు రండహో' అంటూ గురువారం నాగలాపురం మండలం సురుటుపల్లెలో దండోరా వేశారు. దీంతో శుక్రవారం గ్రామసభకు గ్రామస్తులు హాజరై తమకు కావాల్సింది అడిగారు. తాము సమస్యలపై అర్జీలు మాత్రమే స్వీకరిస్తామని, ఎటువంటి కార్డులు ఇవ్వడం లేదని సచివాలయ ఉద్యోగులు చెప్పారు. దీంతో స్థానికులంతా ప్రభుత్వంపై త్రీ ఆగ్రహం వ్యక్తంచేస్తూ వెనుదిరిగారు. ఇలా ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చేట్లుగా.. ఉద్దేశపూర్వకంగానే వైసీపీ నేత ఒకరు తప్పుడు దండోరా వేయించినట్లు ఆరోపణలున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చినా మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికీ వైసీపీ నేతలు చెప్పినట్లుగానే అధికారులు పని చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. సురుటుపల్లెలోనూ ఓ వైసీపీ నాయకుడు ఇటు సచివాలయ సిబ్బందిని, అటు మండల స్థాయి అధికారులను చేతిలో పెట్టుకుని తాను చెప్పిందే జరగాలని చక్రం తిప్పుతున్నట్లు టీడీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. టీడీపీ నాయకులు చేపట్టే పలు పనులకు ఆ నేత తరచూ అడ్డు పడుతున్నారని ఆగ్రహంతో ఉన్నారు. ఈ క్రమంలో శుక్రవారం గ్రామసభకు గైర్హాజరై తమ నిరసన తెలిపారు. సర్పంచి కాంతమ్మ, ఆమె భర్త సుబ్రహ్మణ్యం పదినిమిషాలు పాల్గొని వెళ్లిపోయారు. దీంతో ఏడెనిమిది మందితో గ్రామసభను తూతూమంత్రంగా నిర్వహించారు.

చంద్రగిరి కోటలో సౌండ్ అండ్ లైటింగ్ షో ప్రారంభం

చంద్రగిరి, సెప్టెంబరు 27: పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం చంద్రగిరి కోటలో సౌండ్ అండ్ లైటింగ్ షోను జేసీ శుభం బన్సల్ పునఃప్రారంభించారు. తొలుత చంద్రగిరి టవర్ క్లాక్ నుంచి వందలాది విద్యార్థులు, ప్రజలతో కోట వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మీడియాతో మాట్లాడుతూ.. త్వరలోనే ఫుడ్ కోర్టు, బోటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. తిరుపతి జిల్లాలో తిరుమల, శ్రీకాళహస్తి తదితర పుణ్యక్షేత్రాలు, బీచ్ రిసార్ట్‌లు, జలపాతాలు, ఇతర పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని పేర్కొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలలో చంద్రగిరి చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జేసీ చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. ఈకార్యక్రమంలో ఈఈ సుబ్రమణ్యం, జిల్లా పర్యాటకశాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి, ఏపీటీడీసీ డీవీఎం గిరిధర్‌రెడ్డి, ఆర్కియాలజీ సబ్ సర్కిల్ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌కుమార్, లక్స్ అండ్ డెసిబుల్స్ ప్రతినిధి శివ, లైటింగ్ షో మేనేజర్ మోహన్, డీఈవో శేఖర్, డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీవో బాలాజీనాయక్, టీడీపీ మండలాధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, ఈశ్వర్‌రెడ్డి, తిరుమలరెడ్డి, బెల్లంకొండ మురళి, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సింగు సుధా, టీడీపీ నాయకుడు గౌస్‌బాషా, కొండూరు ప్రవీణ్‌రాయల్, తులసేశ్వర్‌రెడ్డి, మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







హెరిటేజ్ వాక్‌లో జేసీ, విద్యార్థులు తదితరులు - చంద్రగిరి కోటలో లైటింగ్ - చంద్రగిరి కోటకు విచ్చేసిన విద్యార్థులు

వైద్యం కోసం వచ్చిన బాలుడిపై వైద్యుడి దాడి

- నొప్పికి ఏడుస్తుండటంతో ఆగ్రహం
- ప్రశ్నించిన తల్లిపైనా చేయి చేసుకున్న వైనం
- ఆందోళనకు దిగిన బాధితులకు సర్దిచెప్పిన పోలీసులు, వైద్యాధికారులు


డాక్టరును విచారిస్తున్న పోలీసు అధికారి, వైద్యాధికారి


క్యాండిలాను లాగేయడంతో చేతినుంచి కారుతున్న రక్తాన్ని ఆపుతున్న బాలుడి తల్లి

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 27: ఆరేళ్ల బాలుడు. డాక్టరు పరీక్షిస్తుండగా నొప్పితో అరిచాడు. కాళ్లు చేతులు ఆడించాడు. అంతే.. ఆ డాక్టరుకు కోపమొచ్చింది. విచక్షణ మరిచి కొట్టారు. ఈ ఘటన తిరుపతిలోని రుయా చిన్నపిల్లల విభాగంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన ప్రకారం.. చిత్తూరు జిల్లా ఐరాల మండలం కామినేనిపల్లికి చెందిన లక్షిత్(6)కు కొద్ది రోజులుగా యురాలజీ సమస్య ఉంది. వైద్యం కోసం ఇతడిని తల్లి యోగారాణి గురువారం తిరుపతిలోని రుయా చిన్నపిల్లల విభాగానికి తీసుకొచ్చారు. ఇన్‌ఫెక్షన్ వచ్చిందని, వెంటనే సర్జరీ చేయడానికి అడ్మిట్ కావాలని వైద్యులు చెప్పారు. అదే రోజు బాలుడ్ని అడ్మిట్ చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం ఓపీలో డాక్టరును సంప్రదించాలని చెప్పడంతో బిడ్డను తీసుకుని యోగారాణి వెళ్లారు. సర్జరీ డాక్టరు రవికిరణ్ బాలుడిని బెడ్‌పై పడుకోబెట్టి గాయం ఉన్న భాగంపై గట్టిగా నొక్కుతూ పరీక్షించారు. దీంతో బాలుడు పెద్దగా కేకలు వేయడంతోపాటు కాళ్లు చేతులు ఊపాడు. కోపోద్రిక్తుడైన డాక్టరు వెంటనే బాలుడి చెంపపై, కాళ్లపై చేత్తో గట్టిగా కొట్టడంతోపాటు కేకలు ఆపాలని గద్దించారు. అయినా నొప్పిని తట్టుకోలేక బాలుడు అరుస్తుండటంతో మరోసారి చెంపపై కొట్టారు. ఎందుకు సార్ అలా కొడుతున్నారని యోగారాణి అడగ్గా.. 'అసలు నువ్వు మనిషివా? నీ కొడుకుని సర్దిపెట్టం కూడా నీకు రాదా' అంటూ ఆమెనూ అసభ్యకర పదజాలంతో దూషించారు. అదే ఆవేశంలో ఆమె చేతిపైనా కొట్టారు. ఆమె ఎదురు తిరగ్గా వైద్యం చేసేది లేదని, మీ దిక్కున్న చోట చెప్పుకోండంటూ ఆవేశంగా బాలుడి చేతికి ఉన్న సెలైన్ పెట్టే క్యాండిలాను డాక్టరు లాగేశారు. దీంతో బాలుడి చేతి నుంచి తీవ్రంగా రక్తం కారుతుండగా ఆమె బాలుడిని తీసుకుని బయటకు వచ్చారు. అక్కడే ఉన్న సిబ్బంది కాటన్ తీసుకొచ్చి కారుతున్న రక్తాన్ని ఆపింది. బాలుడి చెంపపై, కంటి కింద డాక్టరు కొట్టడంతో చిన్నపాటి కమిలిన గాయాలయ్యాయి. వైద్యం కోసం వచ్చిన తన బిడ్డను, తనను ఎందుకు కొట్టారని తమకు సమాధానం చెప్పాలంటూ కుటుంబ సభ్యులతో కలిసి ఆమె అక్కడే ఆందోళనకు దిగారు. వైద్యాధికారులు, వెస్ట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. దాడికి పాల్పడిన డాక్టర్ రవికిరణ్‌ను మందలించి బాధితులకు నచ్చజెప్పారు. ఏదో టెన్షన్‌లో డాక్టరు అలా చేశాడని ఈ ఒక్కసారికి క్షమించాలని కోరడంతో వారు ఆందోళన విరమించారు. దీనిపై సూపరింటెండెంట్ రవిప్రభును వివరణ కోరగా.. వైద్యం కోసం వచ్చిన వారి పట్ల ఇలా వ్యవహరించడం విచారకరమన్నారు. మరోసారి ఇటువంటివి జరగకుండా చూస్తామన్నారు. రోగులపట్ల ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




విద్యుత్ అలంకరణలో శ్రీవారి ఆలయం - మాడవీధిలో... - ఆస్థానమండపం వద్ద లక్ష్మీదేవి

విద్యుత్‌కాంతులతో కనువిందు


ప్రధాన కూడలిలో వెలుగులు


రాంభగీచ ముందున్న రోడ్డులో..

తిరుమల వెంకన్న క్షేత్రం గురువారం విద్యుత్‌కాంతుల్లో కనువిందు చేసింది. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో రెండు నెలలుగా శ్రీవారి ఆలయంలో పాటు మాడవీధుల్లో రోడ్లపై, కాటేజీల వద్ద, ముఖ్యమైన కూడళ్లు, పార్కుల్లో విద్యుత్ అలంకరణ పనులు చేపట్టి పూర్తి చేసింది. వీటి పనితీరు ఎలా ఉందనేది గురువారం రాత్రి పరిశీలించింది. దీంతో తిరుమల వెలుగులీనింది. విద్యుత్ విభాగం అధికారులు, సిబ్బంది గుర్తించిన లోటుపాట్లను సవరించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

దళితుడిపై దాడి చేసిన కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలి

ఎస్పీ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ నేతల ఆందోళన


ఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 27: వెంకటగిరి పట్టణంలో పోలేరమ్మ జాతరలో దళిత నాయకుడు లంక చెంచుకుమార్‌పై దాడి చేసిన కానిస్టేబుళ్లు జయచంద్ర, శివనారాయణలపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం బాధితుడు చెంచుకుమార్‌తో కలసి ఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు గోపి మాట్లాడుతూ పోలేరమ్మ విగ్రహం ఊరేగింపులో భాగంగా పలువురు యువకులు పీకలు ఊదుతుంటే పోలీసులు గదమాయించడం సరికాదన్నారు. జాతరలో ఇది మామూలే అని నచ్చజెప్పడానికి ప్రయత్నించిన చెంచుకుమార్‌పై కానిస్టేబుళ్లు జయచంద్ర, శివనారాయణ లాఠీలతో విచక్షణా రహితంగా రక్త గాయాలు అయ్యేలా దాడి చేయడం దారుణమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు ఇంతటి దారుణానికి పాల్పడడం శోచనీయమన్నారు. శనివారం లోగా కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోకపోతే 28న వెంకటగిరి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపడతామని హెచ్చరించారు. ఈ మేరకు అదనపు ఎస్పీ వెంకట్రావుకు వినతిపత్రం అందశాశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రవి మాదిగ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య పాల్గొన్నారు.

తిరుమలలో హడలెత్తించిన నాగుపాము


పట్టుబడిన పాము

తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల పాపవినాశనం మార్గంలోని వేణుగోపాల స్వామి ఆలయం ఆలయం వద్ద శుక్రవారం ఓ నాగుపాము హడలెత్తించింది. ఓ దుకాణంలోకి సుమారు ఆరు అడుగుల పాము చొరబడి.. ఓ వ్యక్తిని కాటువేసేందుకు ప్రయత్నించింది. దీంతో ఆయన బయటకు పరుగులు తీశారు. టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడు అక్కడికి చేరుకుని పామును పట్టుకుని దట్టమైన అడవిలో విడిచిపెట్టారు.

స్విమ్స్‌లో మాస్టర్ హెల్త్ చెకప్ ప్యాకేజీలు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 27 : స్విమ్స్‌లోని కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో రోగుల సౌకర్యార్థం మాస్టర్ హెల్త్ చెకప్ ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులకు రూ.5,900, మహిళలకు రూ.6,500లతో ప్యాకేజీలు తీసుకువస్తున్నామని వివరించారు. కార్డియాలజీ క్లినిక్‌కు సంబంధించి రూ.2,100 ధర నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ ప్యాకేజీల కోసం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్విమ్స్ క్లినిక్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజును లేదా 9441239836కు సంప్రదించాలని తెలిపారు.

నేడు సుప్రీంకోర్టు సీజే రాక

- రేపు జాయింట్ పార్లమెంటు కమిటీ జిల్లా పర్యటన


అధికారులతో సమీక్షిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 27: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ ధనంజయ వై చంద్రచుడ్ శనివారం జిల్లాకు వస్తున్నట్లు జేసీ శుభం బన్సల్ తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన అధికారులతో సమీక్షించారు. సుప్రీంకోర్టు సీజే శనివారం చేరుకుని.. ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుగుపయనం అవుతారన్నారు. అదే విధంగా జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఆదివారం జిల్లా పర్యటనకు రానుందన్నారు. ఇక అక్టోబరు 1 నుంచి 8వ తేదీ వరకు జిల్లాలో నేషనల్ లెవల్ మానటరింగ్ బృందం పర్యటిస్తుందని చెప్పారు. వీరిరాక సందర్భంగా భద్రత, ప్రొటోకాల్, విమానాశ్రయం వద్ద స్వాగతం, వీడ్కోలు తదితర ఏర్పాట్లు విధులు కేటాయించిన అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

పంచాయతీరాజ్ ఈఈ బాధ్యతల స్వీకరణ

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 27: పంచాయతీరాజ్ తిరుపతి డివిజన్ ఈఈగా ఎం.రామమోహన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల బదిలీల్లో భాగంగా పులివెందుల డివిజన్‌లో పనిచేస్తున్న ఆయన తిరుపతి ఈఈగా నియమితులైన విషయం విధితమే. శుక్రవారం బాధ్యతలు చేపట్టిన ఆయనకు కార్యాలయ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కూలి రేట్లు పెంచండి


నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, సివిల్ సప్లైస్ కార్మికులు

తిరుపతి (కలెక్టరేట్), సెప్టెంబరు 27: ధరలకనుగుణంగా సివిల్ సప్లైస్ హమాలీలకు కూలి రేట్లు పెంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మామిడికాయల మండీ వద్ద ఉన్న సివిల్ సప్లైస్ గోదాము వద్ద హమాలీలతో కలిసి శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ సివిల్ సప్లైస్ కార్మికులకు పాత అగ్రిమెంట్ గడువు ముగిసి 9 నెలలైనా కొత్త దాని గురించి పట్టించుకోవడం లేదన్నారు. జీతాలు సకాలంలో ఇవ్వడంలేదని తెలిపారు. కొత్తగా చేరిన హమాలీలకు పీఎఫ్ అమలు చేయడంలో డీఎం చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. ఇలాగా కొనసాగితే డీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్, రామకృష్ణ, శివ, వెంకటేష్, సురేష్, బాబు, అల్లాబాషా, చెంచుకృష్ణయ్య, మత్తు, పళని, శేషాద్రి గణేష్ పాల్గొన్నారు.

4నుంచి కపిలతీర్థంలో నవరాత్రి ఉత్సవాలు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 27: కపిలేశ్వరస్వామి ఆలయంలోని కామాక్షి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు టీటీడీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. 29వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు పేర్కొంది. చివరి రోజు కపిలతీర్థంలోని ఆంజనేయ స్వామి గుడి వద్ద సాయంత్రం 6 గంటలకు పార్వేట ఉత్సవం ఉంటుందని వివరించింది. టీటీడీకి చెందిన అన్నమాచార్య ప్రాజక్టు, హిందూ ధర్మప్రచార పరిషత్ కళాకారుల భక్తి సంగీతం, దేవీభాగవత పురాణ ప్రవచనం, లలితా సహస్రనామ పారాయణం తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపింది.

నేడు రంగవీక్షణం పుస్తకావిష్కరణ

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 27: తిరుపతికి చెందిన ఆకాశవాణి విశ్రాంత ఉద్యోగి, రచయిత ఆకుల మల్లేశ్వరరావు రచించిన రంగవీక్షణ సమీక్ష వ్యాస సంపుటి ఆవిష్కరణ సభ శనివారం సాయంత్రం 5 గంటలకు లక్ష్మీపురం సర్కిల్‌లోని హోటల్ చక్రిలో నిర్వహించనున్నట్లు విశ్వశ్రీ సాహితీ సమాఖ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎస్వీయూ విశ్రాంతాచార్యులు గార్లపాటి దామోదరనాయుడు అధ్యక్షతన జరిగే సభలో ముఖ్య అతిథిగా వేదవిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి, విశిష్ట అతిథులుగా బీఎస్.రెడ్డి, వీఎస్.రాఘవాచారి, ఆముదాల మురళి, గరికపాటి రమేష్ బాబు, అకుల మల్లేశ్వరరావు హాజరవుతారని పేర్కొంది.

పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం


పుస్తకావిష్కరణ సభలో డీఈవో శేఖర్

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 27: పుస్తక పఠనం పిల్లల్లో వ్యక్తిత్వ వికాసం పెంచుతుందని డీఈవో డాక్టర్ వి.శేఖర్ అన్నారు. మహాకవి గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా పరిషత్ పాఠశాల, మంగళం ట్రెండ్స్‌లో బాలకథానిధి కథల పుస్తకావిష్కరణ సభ, అష్టావధానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఈవో పుస్తకాన్ని ఆవిష్కరించారు. పాఠశాల విద్యార్థులు రాసిన కథలతో కథా సంకలనం తీసుకురావడం సంతోషకరమైన విషయమన్నారు. విశిష్ట అతిథి డాక్టర్ సాకం నాగరాజ మాట్లాడుతూ నేటి పిల్లలకు పఠనంపై ఆసక్తి కలిగించేలా కథల పుస్తకాలు పరిచయం చేయాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం కేశవులునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సభలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి బాలాజి, మండల విద్యాశాఖ అధికారి భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

అలరించిన అవధానం : శతావధాని ఆముదాల మురళి సంచాలకుడిగా కర్నూలుకు చెందిన దంత వైద్యుడు డాక్టర్ బొరెల్లి హర్ష అష్టావధానం నిర్వహించారు. ప్రాశ్నికులుగా విద్వాన్ గుండుపల్లె గోవిందయ్య, మన్నవ గంగాధరప్రసాద్, వివి రాధామదన, నెమిలేటి కిట్టన్న, ఆమూరి సుబ్రహ్మణ్యం, యువశ్రీమురళి, చిట్టేటి దుర్గ, కె.బాలాజి, బి.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

బీవోఐ ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్ ప్రారంభం

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 27: బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్ల సౌకర్యార్థం పండుగ సీజన్ బహుమతిగా రూ.3కోట్ల కంటే తక్కువ బడ్జెట్‌లో ప్రత్యేక 400 రోజుల రీటైల్‌టర్మ్ డిపాజిట్‌ను ప్రవేశపెట్టిందని జోనల్ మేనేజర్ ఎం.వి.వి.బంగార్రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆకర్షణీమైన వడ్డీ రేట్లు కల్పించామని, ఈ సౌకర్యం శుక్రవారం నుంచే అన్ని శాఖలలో అందుబాటులోకి వచ్చిందని, డిజిటల్ ఛానెల్ ద్వారా కూడా పొందవచ్చునని పేర్కొన్నారు. కస్టమర్లు ఈ అకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



సీఎం, డిప్యూటీ సీఎం పర్యటనలను విజయవంతం చేద్దాం

కూటమి నేతల తీర్మానం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

తిరుపతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టు వస్త్రాలు సమర్పించేందుకు సీఎం చంద్రబాబు, ప్రాయశ్చిత్త దీక్ష ఉపసంహరణ కోసం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తిరుపతి, తిరుమల పర్యటనలను విజయవంతం చేయాలని ఎన్డీఏ కూటమి నేతలు తీర్మానం చేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అధ్యక్షతన శుక్రవారం ఓ ప్రైవేట్ హోటల్లో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్టోబరు 3న జరగనున్న పవన్ కల్యాణ్ వారాహి బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల మొదటి రోజైన అక్టోబర్ 4న సీఎం శ్రీవారికి పట్టువస్త్రాలు సతీసమేతంగా సమర్పించనున్నారన్నారు. విమానాశ్రయంలో ఘన స్వాగతం పలకాలని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నరసింహ యాదవ్, ఊకా విజయకుమార్, దంపూరి భాస్కర్, పాటకం వెంకటేష్, మన్నెం శ్రీనివాసుల నాయుడు, రుద్రకోటి సదాశివం, జనసేన నేతలు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్, రాజారెడ్డి, పొలకల మల్లికార్జున్, బీజేపీ నాయకుడు అజయకుమార్ పాల్గొన్నారు.

నేడు, రేపు అమిగోస్ బిల్డర్స్ కస్టమర్ మేళా

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 27: మధ్య తరగతి ప్రజల చిరకాల ఆకాంక్ష సొంతింటి కల. ఆ స్వప్నం నెరవేర్చేందుకు అమిగోస్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ యాజమాన్యం అతి తక్కువ ధరలకు అపార్టుమెంట్స్ కస్టమర్ మేళ కార్యక్రమాన్ని శని, ఆదివారాల్లో నిర్వహించనుంది. సంస్థ అధినేత అనిత్‌రెడ్డి శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ తిరుపతి రూరల్ మండలం అవిలాలగ్రామ సచివాలయం ఎదురుగా అత్యంత సుందరంగా, ఉత్తమ నాణ్యత ప్రమాణాలతో రెడ్‌వోక్స్ అపార్టుమెంట్స్ సిద్ధమైందన్నారు. ఇందులో క్లబ్‌హౌస్, స్విమ్మింగ్‌పూల్, జిమ్, పిల్లలకు ఆటస్థలం వంటి సకల వసతులు ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తిగలవారు అపార్టుమెంట్‌ను సందర్శించాలని కోరారు. బుక్ చేసుకున్న వారికి చదరపు అడుగుపై భారీ తగ్గింపు ఉంటుందని తెలిపారు.

చెస్ రన్నరప్‌గా జువైనల్ హోం బాలురు



తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 27: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ ప్రభుత్వ పరిశీలన గృహాల్లో(జువైనల్ హోం)ని బాలురకు శుక్రవారం నిర్వహించిన ఆన్‌లైన్ చెస్ పోటీల్లో మంగళం ప్రభుత్వ పరిశీలన గృహ బాలురు రన్నరప్‌గా నిలిచారు. వారిని పలువురు అభినందించారు. పోటీల పర్యవేక్షకులుగా ఆలిండియా చెస్ ఫెడరేషన్ ఆర్బిటర్ మల్లికార్జున్, తిమ్మప్ప వ్యవహరించారు.

కేజీబీవీల్లో కాంట్రాక్ట్ పోస్టులకు దరఖాస్తులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 27: జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులను 2025-26 సంవత్సరానికిగాను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు డీఈవో డాక్టర్ వి.శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ-3, పార్ట్ టైమ్ టీచర్-2 మొత్తం 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు apkgbv.apcfss.in వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. రూ.250 దరఖాస్తు రుసుంతో ఈ నెల 28వ తేదీ నుంచి వచ్చేనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

2న అండర్ 19 క్రికెట్ జట్టు ఎంపిక

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 27: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 2న అండర్ 19 క్రికెట్ జట్టును ఎంపిక చేయనున్నట్లు ఎస్జీఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జయరామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు చిత్తూరులోని డీఎస్‌ఏ క్రీడా మైదానంలో ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వాసులై ఉండి, 2006 జనవరి ఒకటి తర్వాత జన్మించి, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. పదవ తరగతి మార్కుల లిస్టు, స్టడీ, ఆధార్ జిరాక్సులను తప్పక తీసుకురావాలని, మరిన్ని వివరాలకు 9393621004ను సంప్రదించాలని కోరారు.

పారిశుధ్యంపై అవగాహనకే నాటక ప్రదర్శనలు

తిరుపతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన పెంచడానికే నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో భాగంగా నగర పాలక సంస్థ పరిధిలోని ప్రకాశం పార్కు, వైకుంఠపురం ఆర్చ్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తూ నాటక ప్రదర్శనలు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 17నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇల్లే కాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాగా తడి, పొడి చెత్త వేరుచేసి ఇవ్వడం వలన కలిగే లాభాల గురించి చిన్నారులు ప్రదర్శించిన నాటకం విశేషంగా ఆకట్టుకుంది. స్వచ్ఛ భారత్‌పై విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, డీసీ అమరయ్య, ఎంహెచ్‌వో యువ అన్వేష్, ఆర్వో సేతుమాధవ్, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి, మిమిక్రీ కళాకారుడు విజయకుమార్ పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.లక్ష విరాళం


చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న కేబుల్ ఆపరేటర్స్ నాయకులు

తిరుపతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి రాష్ట్ర కేబుల్ ఆపరేటర్ల జేఏసీ లక్ష రూపాయలు అందజేసింది. ఈ మేరకు శుక్రవారం జేఏసీ నాయకులు పెరుమాళ్ మధు, సీతారామయ్య, బసవయ్య, నగేష్, శాంతికుమార్, దుర్గాప్రసాద్‌లు సీఎం చంద్రబాబును కలిసి చెక్కు అందజేశారు.

సీఎంను కలిసిన ప్రత్యేక పోలీసు అధికారుల సంఘ నేతలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 27: ఏపీ ప్రత్యేక పోలీసు అధికారుల సంఘ ప్రధాన కార్యదర్శి ధర్మచందు శుక్రవారం సీఎం చంద్రబాబును కలిశారు. తమను గత ప్రభుత్వం రోడ్డు పాలు చేసిందని తెలిపారు.ఈప్రభుత్వంలోనైనా తమను యాంటీ నార్కోటిక్ టాస్క్‌ఫోర్సులో విలీనం చేయాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

62 మంది వాహనదారులకు జరిమానా

తిరుమల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన 62 మందికి తిరుమల క్యాంపు కోర్టులో జరిమానా విధించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించిన వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. 62 మంది ట్యాక్సీ డ్రైవర్లకు రూ.వెయ్యి చొప్పున కోర్టు జరిమానా విధించింది. అనంతరం ట్యాక్సీ డ్రైవర్లతో ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. భక్తులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఊకా విజయకుమార్‌కు సన్మానం



తిరుపతి అర్బన్, సెప్టెంబరు 27: రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ సీనియర్ నేత ఊకా విజయకుమార్‌ను టీడీపీ నాయకులు, అభిమానులు శుక్రవారం గజమాలతో ఘనంగా సత్కరించారు. ఐఎస్ మహల్ సమీపంలోని ఆయన కార్యాలయంలో టీడీపీ నేత జేబీ శ్రీనివాస్, నగర ప్రధాన కార్యదర్శి మహేష్‌యాదవ్, రఘు, బాక్సింగ్ అసోసియేషన్ నాయకులు గిరి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

ఇళ్ల నిర్మాణం చేపట్టకపోతే రాయితీ రద్దు

● నేడు లబ్ధిదారులకు అవగాహన

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 27: నిరుపేదలకు పీఎంఏవై పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణం ఈ ఏడాది డిసెంబర్ లోగా పూర్తి చేయకపోతే ప్రభుత్వ రాయితీ రద్దవుతుందని గృహ నిర్మాణ సంస్థ అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు పుత్తూరు పరిధిలో లబ్ధిదారులకు అవగాహన కల్పించేదుకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 28న శనివారం ఉదయం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. పుత్తూరు పట్టణ పరిధిలో గడిచిన ఏడు సంవత్సరాల్లో ఇళ్ల నిర్మాణం కోసం 2,618 మందితో లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేశారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.50 లక్షలు ప్రభుత్వం అందిస్తుండగా, రూ.30 వేలు ఉపాధి హామీ నిధుల నుంచి లబ్ధిదారులకు అందిస్తున్నారు. ఈ క్రమంలో 700 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. అలాగే పుత్తూరు రూరల్ పరిధిలో 493 మంజూరు కాగా, 285 పెండింగ్‌లో ఉండగా, 140 నిర్మాణాలే చేపట్టలేదు. వీరందరికీ మరో అవకాశం కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నట్టు గృహనిర్మాణ సంస్థ ఏఈ వెంకటరత్నం పేర్కొన్నారు.పీఎంఏవై పథకం - 1 డిసెంబర్ - 2024 తో ముగియనుందని, లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. మొదటి విడత పీఎంఏవైలో ఇల్లు మంజూరైన వారికి రెండో విడతకు మార్చరని తేల్చి చెప్పారు.

ఇంటింటా ఇది మంచి ప్రభుత్వ సంబరాలు


స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే

వడమాలపేట, సెప్టెంబర్ 27: కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజుల పాలనపై ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి నగరి నియోజకవర్గంలో విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ వంద రోజుల పాలనలో అభివృద్ధికి సంకేతంగా ఇంటి గోడలపై స్టిక్కర్లను అతికించారు. వడమాలపేట, ఓబీఆర్ కండ్రిగలో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

గంజి మాధవయ్యకు అభినందనల వెల్లువ



పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 27: రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన గంజి మాధవయ్యకు పార్టీ నేతలు, అభిమానులు, శ్రేయోభిలాషుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. శుక్రవారం టీడీపీ నేతలు పలువురు ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ధనపాల్, పార్టీ చిత్తూరు పార్లమెంట్ ఎస్టీ కార్యదర్శి చెంచయ్య, ఐటీడీపీ కోఆర్డినేటర్ ఈశ్వర్ యాదవ్, ఎంసీటీసీ మాజీ సభ్యులు గజపతి, శ్రీరాములు, వార్డు అధ్యక్షుడు మధు, ఉమాశంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సబ్ రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ


విజయభాస్కర్

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 27: పుత్తూరు సబ్ రిజిస్ట్రార్‌గా విజయభాస్కర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నిబంధనలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు చేపడతామన్నారు. సకాలంలో దరఖాస్తుదారులకు సేవలందిస్తామని తెలిపారు. కాగా, కార్యాలయం సిబ్బంది సబ్ రిజిస్ట్రార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే పుత్తూరు డిప్యూటీ తహసీల్దార్‌గా అశోక్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు రిపోర్ట్ చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యతా క్రమంలో పథకాల అమలు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యాలయంలో అందుబాటులో ఉంటానని డీటీ చెప్పారు.

పాఠశాలకు నగదు వితరణ

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 27: పిళ్లారుపట్టు జిల్లా పరిషత్ పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయురాలిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన జయశ్రీ రూ. 10 వేలను పాఠశాల అభివృద్ధికి వితరణ అందజేశారు. హెచ్‌ఎం మునిలక్ష్మి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు కిట్ల అందజేత



వడమాలపేట, సెప్టెంబర్ 27: విజన్ స్వర్ణాంధ్రలో భాగంగా వడమాలపేట పంచాయతీ పారిశుధ్య కార్మికులకు రక్షణ కిట్లను అందజేశారు. శుక్రవారం మండలంలో గ్రామ సభలను నిర్వహించారు. వడమాలపేటలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు ఆధ్వర్యంలో గ్రామసభ జరిగింది. ఎంపీడీవో భానుమూర్తి, ఈవోపీఆర్డీ రూప, కార్యదర్శి శ్రీలేఖ, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య నాయకులు ఢిల్లీ ప్రసాద్, శివరాయల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహాజన సభ

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 27: మండలంలోని తడుకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు మహాజన సభ నిర్వహిస్తున్నట్లు అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి ఝాన్సి, సీఈవో వేణు తెలిపారు. రైతులు తమ సభ్యత్వాన్ని కొనసాగించడానికి ఆధార్ కార్డు, పట్టాదారు పాసు బుక్, ఫొటోలు, రూ.100 చెల్లించి ఈకేవైసీ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.


కంటి వైద్య శిబిరం

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 27: తిరుపతి శంకర్ నేత్రాలయ వైద్యశాల సహకారంతో శుక్రవారం రాస్ కార్యాలయంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాస్ సంఘ పరిధిలోని పొదుపుసంఘాల మహిళలు హాజరై పరీక్షలను చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ నేత్రాలయ వైద్యులు అరవింద్, వెంకటముని, రాస్‌సిబ్బంది ప్రకాష్, ఏకాంబరం, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 27: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, పర్యావరణాన్ని కాపాడుకుందామని మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ శాఖ, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పుత్తూరు మున్సిపల్ పార్కును శుభ్రం చేశారు.

జాబ్‌మేళాలో 22 మంది ఎంపిక



పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 27: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 22 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరయ్య తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా నిర్వహించిన మేళాకు 56 మంది హాజరుకాగ, 22 మంది ఉద్యోగ అవకాశాలు పొందారని ప్రిన్సిపాల్ తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ వీరయ్య, ప్లేస్‌మెంట్ అధికారి చైతన్య, సీడాప్ జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో కాంట్రాక్ట్ పోస్టులకు దరఖాస్తులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 27: జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులను 2025-26 సంవత్సరానికిగాను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు డీఈవో డాక్టర్ వి.శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ-3, పార్ట్ టైమ్ టీచర్-2 మొత్తం 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు apkgbv.apcfss.inలో పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. రూ.250 దరఖాస్తు రుసుంతో ఈ నెల 28వ తేదీ నుంచి వచ్చేనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 27: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలికల)లో మండల స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేపట్టారు. ఎంఈవో తిరుమలరాజు, హెచ్‌ఎం భువనేశ్వరి పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

పోలేరమ్మ ఆదాయం రూ.20లక్షలు

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 27: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ అమ్మవారికి ఏడు రోజులకు గాను హుండీ ద్వారా రూ.20,08,028ల ఆదాయం వచ్చింది. దేవదాయ ధర్మా దాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రామమందిరలో హుండీ ఆదాయాన్ని లెక్కిం చారు. రూ.243947 నగదు, బంగారు 7గ్రాముల 200మిలీ గ్రాములు, వెండి 98 గ్రాముల 500 మిల్లీలు, పాదముల ద్వారా 12 గ్రాముల 563 మిల్లీ వచ్చింది. కాగా యూఎస్ డాలర్లు-21, కువైట్ దినార్ -1, ఒమన్ అర రియల్ వచ్చిందని ఈవో శ్రీనివాసులు రెడ్డి వివరించారు. కమిటీ నిర్వహకులు, అధికారులు పాల్గొన్నారు.

వంద రోజుల్లోనే సుపరిపాలన

చిల్లకూరు, సెప్టెంబరు 27: కూటమి ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లోనే ప్రజలకు సుపరిపాలన అందించామని ఇది భవిష్యత్తులోనూ కొనసాగుతుందని టీడీపీ నాయకుడు వెంకటేశ్వర్లు నాయుడు వివరించారు. మండలంలోని కమ్మవారిపాళెం గ్రామంలో శుక్రవారం విజన్ స్వర్ణాంధ్ర -2047 గ్రామసభ నిర్వహించారు. ఇందులో విజన్ స్వర్ణాంధ్ర 2047, స్వచ్ఛతాహిసేవ, మన ఇల్లు-మనగౌరవం వంటి పలు అంశాలపై ఈవోపీఆర్‌డీ మాణిక్యం ప్రజలకు వివరించారు.

బాధ్యతలు చేపట్టిన అధికారులు

కోట, సెప్టెంబరు 27 : కోట మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా అరవింద శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న హేమంత్ గూడూరుకు బదిలీ అయ్యారు. అదేవిధంగా వెలుగు కార్యాలయంలో ఏపీఎంగా అనీలా బాధ్యతలు తీసుకోగా, ఇక్కడ పనిచేస్తున్న ఏపీఎం రత్నయ్యను చిల్లకూరుకు బదిలీ చేశారు. అదే విధంగా కోట సబ్‌రిజిస్ట్రార్‌గా ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలు నుంచి సముద్రాల సుబ్రహ్మణ్యం బాధ్యతలు తీసుకోగా ఇక్కడ పనిచేస్తున్న ప్రవీణాదేవి బుజబుజనెల్లూరుకు బదిలీ అయ్యారు.

అభివృద్ధి.. సంక్షేమమే లక్ష్యం

తడ, సెప్టెంబరు 27 : అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్య మని ఆమేరకు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం రాత్రి కాదలూరు గ్రామంలో విజన్-2047 స్వచ్ఛతా హి సేవా గ్రామ సభ జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ విజన్‌గల నాయకుడు ముఖ్యమంత్రి అయితే ఆ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని అందుకు తమ ప్రభుత్వం వంద రోజులపాలనే నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో విజయకుమార్, టీడీపీ నాయకులు బొమ్మన పళణి, సుదర్శన్‌మొదలియార్, సెల్వం, సుధాకర్, జయపాల్, చంద్రయ్య పాల్గొన్నారు.

పొలం దున్నడంపై నిలదీసినందుకు దాడి

తడ, సెప్టెంబరు 27 : తన పొలంలో అన్యాయంగా దున్నుతున్నారని అడిగి నందుకు దాడిచేసి గాయపరిచారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెరియవట్టు గ్రామానికి చెందిన ఇబ్రహీం కాలేషా అనే వ్యక్తికి అదే గ్రామంలో కొంత పొలం ఉంది. అయితే చెన్నైకు చెందిన ఇబ్రహీం అనే మరో వ్యక్తి పొలం తనదంటూ వివాదానికి దిగాడు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఇబ్రహీం కాలేషా ఫిర్యాదు చేసి విచారణ చేయాల్సిందిగా కోరారు. ఈ క్రమంలో గురువారం విచారణ చేయగా అది ఇబ్రహీం కాలేషాదే అని నిర్ధారించారు. అయితే ఇవేమీ పట్టించుకోని ఇబ్రహీం శుక్రవారం పొలం దున్నాడు. ఇబ్రహీం కాలేషా దీనిని ప్రశ్నించాడు. దీంతో ఇబ్రహీం అతని బంధువులు కలసి ఇబ్రహీం కాలేషాపై దాడిచేసి గాయపరిచాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జిల్లా ఆర్యవైశ్య కమిటీ ప్రమాణస్వీకారం

నాయుడుపేట, సెప్టెంబరు 27 : తిరుపతి రూరల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ పాలకమండలి ప్రమాణ స్వీకారం 28వ తేదీ శనివారం నాయుడుపేటలోని వాసవీ కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు రూరల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు గూడూరు కిషోర్‌కుమార్ శుక్రవారం తెలిపారు.

మిద్దెపై నుంచి జారిపడిన యువకుడి మృతి

తడ, సెప్టెంబరు 27 : నిద్రమత్తులో మిద్దెపై నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. రామాపురం గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్ (22) ఈ నెల 19వ తేదీ రాత్రి సమయంలో ఇంటి మిద్దెపై నిద్రపోయాడు. మిద్దెపై పిట్టగోడలు లేవు. ఈ క్రమంలో అర్ధరాత్రి సమయంలో నిద్రలో దొర్లిన అరుణ్‌కుమార్ కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబసభ్యులు అతడిని చెన్నై ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు.

స్వర్ణాంధ్రను సాధిద్దాం

పెళ్లకూరు, సెప్టెంబరు 27 : స్వర్ణాంధ్రప్రదేశ్ -2047 సాధించేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బంగారం పేట సర్పంచు నాగేంద్రప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని బంగారంపేట గ్రామంలోని వికసిత్ భారత్, స్వచ్ఛతా హి సేవా, ఇది మంచి ప్రభు త్వం కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి రమాప్రభ, సచివాలయ సిబ్బంది కిషోర్, సుహాసిని ఉన్నారు.

గూడూరు: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న విజన్ స్వర్ణాంధ్ర -2047 కార్యక్రమంలో ప్రజలందరూ భాగం కావాలని ఇరిగేషన్‌శాఖ ఏఈ సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని తుంగపాళెం గ్రామంలో విజన్ స్వర్ణాంధ్ర-2047 గ్రామ సభ నిర్వహించారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ రైతుకమిటీ కార్యదర్శి రాఘవరెడ్డి పాల్గొన్నారు.● కొండాగుంట గ్రామంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు.

చిట్టమూరు: అభివృద్ధి కోసం ప్రణాళికా బద్ధంగా పనిచేద్దామని ఎంపీడీవో సాలెడ్ పిలుపు నిచ్చారు. విజన్ స్వర్ణాంధ్ర- 2047లో భాగంగా రాష్ట్రాన్ని నెంబర్ వన్ చేసేందుకు ప్రభుత్వం గ్రామసభలు నిర్వ హించి అభివృద్ధి కోసం ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా చిట్టమూరులో సర్పంచ్ మీదూరు కోటయ్య అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఇందులో స్వచ్ఛత హి సేవ, మన ఇల్లు- మన గౌరవం వంటి అంశాలపై చర్చించారు. తర్వాత ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణుల కు సీమంతం జరిపించారు. అనంతరం ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు, పింఛన్లు కోసం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని ఆమె తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎం సక్కుబాయ్, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు ఉన్నారు.

పోలేరమ్మ జాతర విజయవంతం

- కోటితో అమ్మవారికి హైడ్రాలిక్ రథం
- జాతరలో అధికారులందరూ బాగా పనిచేశారు
- జాతరకు ప్రభుత్వం రూ.50 లక్షలు తొలిసారి విడుదల
- వచ్చే ఏడాది జాతరను ఇంకా వైభవంగా జరిపిస్తాం
- ఎమ్మెల్యే కురుగొండ్ల


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, సెప్టెంబరు 27 : వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర వైభవంగా విజయవంత మైందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన నివాసంలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. జాతరలో సామాన్యులకు పెద్దపేట వేశామన్నారు. వీఐపీ, వీవీఐపీ పాసులు రద్దుచేశామన్నారు. గతంలో గరిష్ఠంగా దర్శన టికెట్ ధర రూ.500లు ఉండగా ఈసారి సామన్య భక్తులను దృష్టిలో పెట్టుకొని రూ.300కు తగ్గించామన్నారు. ఫలితంగా కాస్త ఆదాయం తగ్గినా అందరూ అమ్మవారిని ప్రశాంతంగా దర్శనం చేసుకున్నారని వివరించారు. కొన్ని శాఖల సిబ్బంది వారి బంధువులను పెద్ద ఎత్తున వీఐపీ దర్శనం తీసుకెళ్లడంతో క్యూలైన్లలో వున్న భక్తులకు కొంత అసౌకర్యం ఏర్పడిందన్నారు. వచ్చే ఏడాది ఇలాంటి చిన్న చిన్న పొరపాట్లు కూడా జరగకుండా చూస్తామన్నారు. అమ్మవారికి కోటి రూపాయలు వెచ్చించి హైడ్రాలిక్ రథం సిద్ధం చేస్తామని ప్రకటించారు. ఇందుకోసం దాతల సహకారం తీసుకొంటామన్నారు. గత ప్రభుత్వం వెంకటగిరి జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించినా జాతర నిర్వహణకు ఒక రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఈ ఏడాది తమ ప్రభుత్వం రూ.50 లక్షలు జాతరకు మంజూరు చేయడంతోపాటు అమ్మవారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు పంపిందన్నారు. వెంకటగిరి క్రాస్ రోడ్డు సెంటరు, పాలకేంద్ర సెంటర్లలో పోలేరమ్మ దేవస్థానం సంబంధించిన ఆర్చిలు నిర్మిస్తామని చెప్పారు. దాతల సహకారంతో అమ్మవారికి స్వర్ణ కిరీటం, స్వర్ణ పాదాలు సమకూర్చామని తెలియజేశారు. దీంతో అమ్మవారి స్వర్ణాభరణాల విలువ రూ.3 కోట్లకు చేరిందన్నారు. జాతర ప్రశాంతంగా జరిగేలా తిరుపతి, నెల్లూరు జిల్లాలకు చెందిన కలెక్టర్లు, ఎస్పీలు తగిన చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఈ సమావేశంలో ఆలయ ఈవో శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షులు కేవీకే ప్రసాద్ నాయుడు, వెంకటగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, జాతర పాలక వర్గ సభ్యులు గొల్లగుంట మురళీ కృష్ణ, వెంకటేశ్వరావు, చంద్రారెడి, టీవీఆర్, బీరం రాజేశ్వరరావు, టీడీపీ నాయకులు పప్పు చంద్రమౌళిరెడ్డి, మంకు ఆనంద్, కాపా శ్రీనివాసులు నాయుడు, బాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ చెరలోని ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి


తహసీల్దారు జయజయరావుకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

కోట, సెప్టెంబరు 27 : కోట మండలం కేశవరం పంచాయతీలో ఉన్న లక్షలాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి స్థానిక వైసీపీ నేతలు కబ్జా చేశారని వాటిని పేదలకు పంచాలని టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షులు చాపల శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు తహసీల్దారు జయజయరావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేశవరం రెవెన్యూ గ్రూపులోని సర్వేనెంబరు 308, 309-1, 310-2 తదితర సర్వే నెంబర్లల్లో సుమారు 15 ఎకరాల ప్రభుత్వ భూములను స్థానిక వైసీపీ నేతలు గురుస్వామి, ప్రసాద్ కబ్జాలో ఉన్నాయన్నారు. స్థానికంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఆ భూములు తమకు పంపిణీ చేసి పట్టాలు ఇవ్వాలని గతంలో కోరారని గుర్తు చేశారు. అయితే అప్పట్లో అధికార అండదండలతో వారిని బెదిరిస్తూ వచ్చారన్నారు. ఇప్పుడు కూడా వారి ఆధీనంలో ఉన్నాయని వివరించారు. ఆ భూములు వారినుంచి స్వాధీనం చేసుకుని భూమిలేని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పంచాలని విన్నవించారు. దీనిపై తక్షణ చర్యలు చేపడుతామని తహసీల్దారు జయజయరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిట్టేటి నాగూరయ్య, జడ వేణు, తదితరులు ఉన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి


రికార్డులను పరిశీలిస్తున్న డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసులు

చిల్లకూరు, సెప్టెంబరు 27: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ డీపీఎంవో డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీతో పాటు ఓడూరులోని ఉపకేంద్రాన్ని ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియా, జ్వరాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ల్యాబ్‌లో డయేరియా, జ్వరం పరీక్షలతోపాటు ప్రజలకు అవసరమైన పరీక్షలు చేస్తూ పరీక్షల సంఖ్యను పెంచాలన్నారు. మాతాశిశు మరణాలను తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ బృందం నాగరాజు, ప్రకాష్, బేబీరాణి, పీహెచ్‌సీ వైద్యుడు షాలోమ్‌అరాఫత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట డబ్బులు వసూలు చేసిన నకిలీ దంపతుల అరెస్టు

వారిపై ఖమ్మం, కొత్తగూడెంలోనూ కేసులు

మధిరటౌన్, సెప్టెంబరు 27: ఉద్యోగాల ఇప్పిస్తామని తెలుగు రాష్ట్రాల్లోని పలువురి నుంచి డబ్బులు వసూలు చేసిన నకిలీ దంపతులను పశ్చిమ గోదావరి జిల్లా భీమడోలుకు చెందిన పోలీసులు ఖమ్మం జిల్లా మధిరలోని టీచర్స్ కాలనీలో అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలంలోని బంగారుపేటకు చెందిన అనిల్‌బాబు, కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం కలమల్లకు చెందిన శశాంక తాము దంపతుల మంటూ మధిరలోని న్యూ టీచర్స్ కాలనీలోని ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లోకి గత ఏప్రిల్‌లో అద్దెకు దిగారు. అనిల్‌బాబు తన పేరు కల్యాణ్‌రెడ్డి అని స్థానికులను పరిచేయం చేసుకొని తన తండ్రి ఇస్రోలో పని చేస్తున్నాడని చెపుతూ కారుకు కూడా గవర్నమెంట్ వెహికిల్, ఇస్రో అని స్టిక్కర్ తగిలించుకొని తిరుగుతున్నాడు. ఇతనిపై ఏపీలోని పలు స్టేషన్‌లలో ఉద్యోగాల పేరుతో పలువురిని మోసం చేసిన కేసులు నమోదు కావడంతో పాటు వారెంట్లు కూడా ఉండటంతో భీమడోలు పోలీసులు సెల్ సిగ్నల్ ఆధారంగా బుధవారం రాత్రి మధిరలో అదుపులోకి తీసుకుని భీమడోలు తరలించారు. పోలీసుల విచారణలో మధిరలోని తాను ఉంటున్న ఇంట్లో పలు డాక్యుమెంట్లు ఉన్నాయని చెప్పడంతో వాటిని తీసుకునేందుకు భీమడోలు పోలీసులు గురువారం రాత్రి తిరిగి మధిరకు తీసుకురావడంతో విషయం స్థానికులకు తెలిసింది. వీరు పలుచోట్ల దంపతులుగా నమ్మించి పలువురిని మోసం చేసినట్లు తెలుస్తోంది .వీరిపై తెలంగాణలోని ఖమ్మం, కొత్తగూడెంతో పాటు ఏపీలోని పలుచోట్ల కూడ ఇవే రకం కేసులు నమోదైనట్లు సమాచారం. మధిరలో తాను అద్దెకు ఉంటున్న ఇంటి యజమాని నుంచి కూడాఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రూ.10 లక్షలు వసూలు చేసినట్లు తెలుస్తోంది. దీనిపై టౌన్ ఎస్ఐ సంధ్యను వివరణ కోరగా మధిరలో ఇంతవరకు ఎవరూ వీరిపై ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

దళితుడిపై దాడి చేసిన కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలి


ఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 27: వెంకటగిరి పట్టణంలో పోలేరమ్మ జాతరలో దళిత నాయకుడు లంక చెంచుకుమార్‌పై దాడి చేసిన కానిస్టేబుళ్ల జయచంద్ర, శివనారాయణలపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం బాధితుడు చెంచుకుమార్‌తో కలసి ఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు గోపి మాట్లాడుతూ పోలేరమ్మ విగ్రహం ఊరేగింపులో భాగంగా పలువురు యువకులు పీకలు ఊదుతుంటే పోలీసులు గదమాయించడం సరికాదన్నారు. జాతరలో ఇది మామూలే అని నచ్చజెప్పడానికి ప్రయత్నించిన చెంచుకుమార్‌పై కానిస్టేబుళ్ల జయచంద్ర, శివనారాయణ లాఠీలతో విచక్షణా రహితంగా రక్త గాయాలు అయ్యేలా దాడి చేయడం దారుణమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు ఇంతటి దారుణానికి పాల్పడడం శోచనీయమన్నారు. శనివారం లోగా కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోకపోతే 28న వెంకటగిరి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపడతామని హెచ్చరించారు. ఈ మేరకు అదనపు ఎస్పీ వెంకట్రావుకు వినతిపత్రం అందశాశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రవి మాదిగ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో పంచాయతీలు బలోపేతం


ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, సర్పంచ్ అమృతసరళ

నాయుడుపేట, సెప్టెంబరు 27 : కూటమి పాలనలో పంచా యతీలు ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడు పేట మండలం భీమవరంలో శుక్రవారం సర్పంచ్ అమృతసరళ అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామసభల్లో ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ మంత్రి నెలవల సుబ్రహ్మ ణ్యంలు ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. స్వర్ణంధ్రా 2047 పోస్టర్లను విడుదల చేసి తరువాత నాయకులు, ప్రజలతో కలసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు గీతావాణి, ఎంపీడీవో భువనేశ్వరశర్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, పార్థసారథి, మాజీ ఎంపీపీ కన్నెమ్మ, చంద్రారెడ్డి, మురళీరెడ్డి, బాబు ఉన్నారు.

సూళ్లూరుపేటలో వర్షం



సూళ్లూరుపేట, సెప్టెంబరు 27: సూళ్లూరు పేటలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. శుక్రవారం ఉదయం నుంచి ఉక్కపోతతో జనం అల్లాడారు. అయితే మధ్నాహ్నం ఒక్కసారిగా వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. ఈ వర్షంతో గాండ్లవీధి అన్న క్యాంటీన్ సమీపంలో వర్షపునీటితో మురుగు నీరు చేరింది. ఆ నీరంతా రోడ్డుకు మీదకు చేరడంతో పాదచారులు, వాహన చోదకులకు ఇబ్బందులు తప్పలేదు. అదేవిధంగా జీఎన్‌టీ రోడ్డు నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డుపై కూడా వర్షపునీరు నిలబడటంతో ఇబ్బందులు పడ్డారు.

ప్రభుత్వ భూముల్లోకి ప్రవేశిస్తే చర్యలు తప్పవు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 27 : ప్రభుత్వ భూముల్లోకి అక్రమంగా ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని నాయుడుపేట తహసీల్దారు గీతావాణి హెచ్చరించారు. మండలంలోని కూచివాడ గ్రామసమీపంలోని స్వర్ణముఖి నది పోరంబోకు భూమి సర్వేనెంబరు 140లో గత మాసంలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే ఆక్రమణదారులు మళ్లీ ఆ భూముల్లోకి ప్రవేశించి వ్యవసాయ పనులు చేపట్టారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దారు శుక్రవారం భూమి వద్దకు చేరుకొని ఆక్రమణదారులకు హెచ్చరించారు.

విద్యుత్ డీఈ బాధ్యతల స్వీకరణ



నాయుడు పేట టౌన్, సెప్టెంబరు 27 : నాయుడుపేట విద్యుత్ శాఖ డీఈగా వర ప్రసాద్‌రెడ్డి నియమితులయ్యారు. ఆ మేరకు శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. విద్యుత్‌శాఖ సిబ్బంది ఆయనకు శుభా కాంక్షలు తెలియజేశారు. కాగా గతంలోనూ ఈయన నాయుడుపేటలో పనిచేశారు.

భవిష్యత్తులో మరింత మంచి చేస్తాం

ఓజిలి, సెప్టెంబరు 27 : భవిష్యత్తులో ప్రజలకు మరింత చేస్తామని సర్పంచి తిరుమలశెట్టి శ్రీలక్ష్మి, ఎంపీడీవో రజనీకాంత్, ఎంఈఓ శైలజ, పంచాయతీ కార్యదర్శి రమేష్ తెలియజేశారు. మండలంలోని కురుగొండలో శుక్రవారం సర్పంచి శ్రీలక్ష్మి అధ్యక్షతన గ్రామసభ చేపట్టారు. 'ఇది మంచి ప్రభుత్వం, స్వచ్ఛతా హి సేవ, మన ఇల్లు మన గౌరవం, స్వర్ణాంధ్ర ప్రదేశ్-2047' కార్యక్రమాలపై సభలో అవగాహన కల్పించారు. నాయకులు సతీష్ పాల్గొన్నారు.

దువ్వూరు చేరికకు మరోసారి బ్రేక్

తడ, సెప్టెంబరు 27: వైసీపీకి రాజీనామా చేసిన చెంగాళమ్మ ట్రస్టుబోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి టీడీపీలో చేరికకు మూడోసారీ బ్రేక్ పడింది. కొద్ది రోజులుగా టీడీపీలో చేరేందుకు ఆయన విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అందుకు టీడీపీ నాయకులు కొండేపాటి గంగాప్రసాద్, సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం సహకరిస్తున్నట్లు సమాచారం. కానీ, మూడు నెలల సమయంలో రెండు సార్లు వీరి చేరిక వాయిదా పడింది. తాజాగా శనివారం దువ్వూరుబాలచంద్రారెడ్డి మంగళగిరిలో పార్టీలో చేరతారంటూ సమాచారం వచ్చింది. ఆమేరకు శుక్రవారం అధిష్ఠానంతో గంగాప్రసాద్ చర్చలు జరిపినట్లు సమాచారం. ముందుగా శనివారం చేరికకు రంగం సిద్ధమైనట్లు దువ్వూరు వర్గం నాయకులకు సమాచారం అందింది. దీంతో దువ్వూరు బాలచంద్రారెడ్డి చిట్టమూరు మండలం మల్లాంలోని తమ ఫామ్‌హౌస్‌కు చేరుకొని అనుచరులతో చర్చించి చేరికకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లుగా అయితే సాయంత్రానికి ఈ చేరికకు మరోసారి బ్రేక్ పడ్డట్లుగా దువ్వూరుకు సమాచారం అందినట్లుగా తెలుస్తుంది. వీరి చేరికపై వారం తర్వాత నిర్ణయం తీసుకుంటారని, అప్పుడే చేరికకు తేదీ నిర్ణయిస్తారని తెలిసింది. మూడు నెలల సమయంలో మూడుసార్లు వీరి చేరికకు బ్రేక్‌పడటంతో దువ్వూరు వర్గం డీలాపడింది.

కోట పంచాయతీకి రూ.2.5లక్షల ఆదాయం

కోట, సెప్టెంబరు 27 : దుకాణాల వేలం ద్వారా కోట పంచాయతీకి రూ.2,67,300ల ఆదాయం సమకూరింది. కోట పంచాయతీ కార్యాల యంలో శుక్రవారం కోటలోని దుకాణాలకు వేలం పాటలు జరిగాయి. 9 దుకాణాలకు గాను మూడింటికి మాత్రమే వేలం పాటలు జరిగాయి. మూడు దుకాణాలతో పాటు పాత ఇనుపసామాను, కొయ్యలకు కలిపి రూ.2,67,300లకు పాటదారులు దక్కించుకున్నారు. 6 దుకాణాలకు డిపాజిట్ కట్టేందుకు ఎవరూ ముందుకురాకపోవడంతో వేలం వాయిదావేశారు. ఈ వేలం డీఎల్‌పీవో వెంకటరమణ, ఎంపీడీవో భవానీ, సర్పంచ్ వెంకటరమణమ్మ, ఈవోపీఆర్‌డీ కిరణ్‌కుమార్, కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగాయి.

కోటలో స్వచ్ఛత హి సేవ

కోట, సెప్టెంబరు 27 : మండలంలోని 21 పంచాయతీలలో శుక్రవారం ఆయా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచుల ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవా గ్రామసభలు జరిగాయి. ఉత్తమనెల్లూరు పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో చెరువులోని మట్టిని అక్రమంగా తరలి స్తున్నారని గ్రామస్తులు ఇరిగేషన్ ఎఈ మునిరత్నానికి ఫిర్యాదు చేశారు.

ఇది ప్రజా ప్రభుత్వం


కరపత్రాల పంపిణీలో టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 27: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మంచి పాలన అందిస్తోందని ఇది ప్రజా ప్రభుత్వమని తొట్టంబేడు మండల టీడీపీ అధ్యక్షుడు గాలి మురళీనాయుడు అన్నారు. మండలంలోని కొణతనేరిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ సంక్షేమ వివరాలున్న కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా 1వ తేదీన అర్హులకు ఇంటి వద్దే పింఛన్లు అందిస్తున్నామన్నారు. రైతులకు ధాన్యం కొనుగోలు బకాయిలు, ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిండంతో పాటు సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. సర్పంచ్ గాలి బాలాజీనాయుడు, మాజీ సర్పంచ్ హరిబాబునాయుడు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి జలజ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి సర్పంచులు, వైసీపీ నాయకులు


పార్టీలో చేరిన సర్పంచులు, నాయకులతో పసుపులేటి హరిప్రసాద్

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 27: మండలంలోని వైసీపీకి చెందిన ఇద్దరు సర్పంచులు, 50 మంది నాయకులు జనసేన జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి కె.లావణ్యకుమార్, మండల అధ్యక్షుడు బాషా సమక్షంలో తిరుపతి పార్టీ కార్యాలయంలో ఆ పార్టీలో చేరారు. కొత్తపాళెం సర్పంచ్ సుబ్బరత్నమ్మ, ఆమె భర్త హరిప్రసాద్, పార్లపల్లి సర్పంచ్ వెంకటస్వామి ఆయన కుమారుడు చలపతి సహా పలువురు నాయకులు చేరారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకుడు హరిప్రసాద్ మాట్లాడుతూ... గ్రామ స్వరాజ్యం దిశగా డిప్యూటీ సీఎం పవన్ కష్ట పడుతున్నారని ఆయన నాయకత్వంలో పనిచేయడానికే తాము జనసేనలో చేరామన్నారు.

'కడిగిన ముత్యంలా బయటపడ్డారు'

బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 27: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం లైంగిక ఆరోపణల కేసు నుంచి కడిగిన ముత్యంలా బయట పడ్డారని పలువురు దళిత నాయకులు అన్నారు. ఎమ్మెల్యేపై వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టి వేయడం ఇందుకు నిదర్శనమన్నారు. ధర్మయ్య, బాలకృష్ణ, గోపి, చలపతి, టీడీపీ నాయకులు మునిచంద్ర నాయుడు, రమేష్, పెంచలయ్య, రామనాథం, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత తాగునీటి సమస్యను పరిష్కరించండి

రేణిగుంట, సెప్టెంబరు 27: కలుషిత తాగునటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నాగేశం అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ముందుగా స్వర్ణాంధ్ర 2047 పథకంలో భాగంగా ఐదేళ్లలో పంచాయతీలో చేపట్టనున్న అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం సీపీఎం నాయకురాలు రాజేశ్వరి మాట్లాడుతూ.. వినాయకనగర్, బుగ్గవీధిలో కలుషిత, రంగు నీరు సరఫరా అవుతోందన్నారు. పట్టణంలో బహుళ అంతస్థులకు, ఒక అంతస్థుకు పంచాయతీ వేసే పన్నులు ఎందుకు వ్యత్యాసం ఉందని ప్రశ్నించారు. అలాగే మండలంలో 18 పంచాయతీల్లో ఆయా సర్పంచుల అధ్యక్షతన గ్రామసభ లు జరిగాయి.

నా డబ్బు కట్టందే... నిన్ను వదలను!

రేణిగుంట, సెప్టెంబరు 27: నా డబ్బు కట్టందే నిన్ను వదలనంటూ రాజస్థాన్ యువతి ఓ యువకుడి గల్లా పట్టుకుంది. తిరుపతి, రేణిగుంట ప్రధాన రహదారిలో తిరుచానూరు రైల్వేస్టేషన్ ఎదురుగా రాజస్థాన్‌కు చెందిన మహిళ బతుకుదెరువు కోసం పలక స్టాండ్లను విక్రయిస్తోంది. తిరుపతి నగరం రైల్వే కాలనీకి చెందిన ముగ్గురు యువకులు పీకలదాక మద్యం తాగి ద్విచక్ర వాహనంలో వచ్చి రెండు స్టాండ్లను రూ.800కు మాట్లాడి డబ్బివ్వకుండా పరారవతుండగా వెనుక ఉన్న యువకుడిని చాకచక్యంగా పట్టుకుంది. తన సెల్‌ఫోన్ ఇచ్చి వెళుతా.. మళ్లీ వచ్చి డబ్బిస్తా అన్నా యువతి వదల్లేదు. చేసేది లేక ఆ యువకుడు జరిగిన ఘటనను తన బంధువులకు తెలపడంతో వారు వచ్చి డబ్బివ్వడంతో యువకుడిని విడిచిపెట్టింది.

మాజీ సీఎం పర్యటన రద్దు

ఊపిరి పీల్చుకున్న పోలీసులు

రేణిగుంట, సెప్టెంబరు 27: మాజీ సీఎం జగన్ తిరుమల పర్యటన రద్దు కావడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం సాయంత్రం బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో తిరుమల పర్యటన నిమిత్తం తిరుపతి విమానాశ్రయానికి చేరుకోవాల్సి ఉండగా కూటమి పార్టీలు, హైందవ సంస్థలు నిరసన నేపథ్యంలో విమానాశ్రయం వద్ద హైటెన్షన్ నెలకొంది. అప్పటికే పోలీసు బలగాలు విమానాశ్రయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కానీ మాజీ సీఎం పర్యటన రద్దు కావడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

ఆక్రమిత భూములపై విచారణ: సీపీఎం

రేణిగుంట, సెప్టెంబరు 27: మండల వ్యాప్తంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములపై విచారణ చేపట్టి దళారులను నమ్మి మోసపోయిన పేదలకు న్యాయం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో పట్టణశాఖ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి హాజరయ్యారు. మండలవ్యాప్తంగా అనేక సమస్యలను తీర్చే విధంగా పాలక ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. సీఆర్ఎస్‌లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు.

విద్యతో పాటు క్రీడలూ ముఖ్యమే


సమావేశంలో మాట్లాడుతున్న రామాంజులు

కేవీబీపురం, సెప్టెంబరు 27: విద్యతో పాటు క్రీడలు ముఖ్యమే అని టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు అన్నారు. శుక్రవారం అంజూరు పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడలతో ఆరోగ్యానికి ఎంతో మేలు జరగుతుందన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, మోడల్ స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ సురేష్‌రెడ్డి, ఎంఈవో రవికుమార్, ప్రధానోపాధ్యాయుడు మురళి, గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులకు సన్మానం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 27: తొట్టంబేడు మండల తహసీల్దారు కార్యాలయంలో డీటీగా జగన్‌మోహన్, సీనియర్ అసిస్టెంట్‌గా నారాయణ, అదే విధంగా శ్రీకాళహస్తి మండల సీనియర్ అసిస్టెంట్‌గా నల్లయ్య బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో శుక్రవారం వారిని దళిత సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పులి శ్రీకాంత్, జనమాల గురవయ్య, బాబు, కల్యాణ్, ధన తదితరులు పాల్గొన్నారు.

ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 27: ధరలకు అనుగుణంగా హమాలీల కూలీ ధరలు పెంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. శుక్రవారం సివిల్ సప్లైస్ గోదాము వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... పాత అగ్రిమెంట్ పూర్తై 9 నెలలవుతోందన్నారు. కొత్త ఒప్పందానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. జీతాలు సక్రమంగా ఇవ్వక పోగా ఆ నెపాన్ని సంబంధిత డీటీపై డీఎం నెట్టడం భావ్యం కాదన్నారు. సీపీఐ ఏరియా కార్యదర్శి జె.గురవయ్య, అయ్యప్ప నాయుడు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

తప్పుడు దండోరా!

- ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా వైసీపీ నేత స్కెచ్ వేశారని అనుమానం
- ముందుగానే గ్రామసభను బహిష్కరించిన టీడీపీ శ్రేణులు

నాగలాపురం, సెప్టెంబరు 27: 'యావన్మందికి తెలియజేయడం ఏమనగా.. శుక్రవారం జరిగే గ్రామ సభలో కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇంటి పట్టాలు, ఆధార్ కార్డులు ఇప్పిస్తారహో.. అవసరమైన వాళ్ల రండహో' అంటూ గురువారం నాగలాపురం మండలం సురుటుపల్లెలో దండోరా వేశారు. దీంతో శుక్రవారం గ్రామసభకు గ్రామస్తులు హాజరై తమకు కావాల్సింది అడిగారు. తాము సమస్యలపై అర్జీలు మాత్రమే స్వీకరిస్తామని, ఎటువంటి కార్డులు ఇవ్వడం లేదని సచివాలయ ఉద్యోగులు చెప్పారు. దీంతో స్థానికులంతా ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ వెనుదిరిగారు. ఇలా ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చేట్లుగా.. ఉద్దేశపూర్వకంగానే వైసీపీ నేత తప్పుడు దండోరా వేయించినట్లు ఆరోపణలున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చినా మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికీ వైసీపీ నేతలు చెప్పినట్లుగానే అధికారులు పని చేస్తున్నారన్న విమర్శలున్నాయి. సురుటుపల్లెలోనూ ఓ వైసీపీ నాయకుడు ఇటు సచివాలయ సిబ్బందిని, అటు మండల స్థాయి అధికారులను చేతిలో పెట్టుకుని తాను చెప్పిందే జరగాలని చక్రం తిప్పుతున్నట్లు టీడీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. టీడీపీ నాయకులు చేపట్టే పలు పనులకు ఆ నేత తరచూ అడ్డు పడుతున్నారని ఆగ్రహంతో ఉన్నారు. శుక్రవారం గ్రామసభకు గైర్హాజరై తమ నిరసన తెలిపారు. సర్పంచి కాంతమ్మ, ఆమె భర్త సుబ్రహ్మణ్యం పదినిమిషాలు పాల్గొని వెళ్లిపోయారు. దీంతో ఏడెనిమిది మందితో గ్రామసభను తూతూమంత్రంగా నిర్వహించారు.


ఏడెనిమిది మందితో జరిగిన గ్రామ సభ

తిరుపతి ఐఐటీ నవావిష్కార్‌కు నేషనల్ అవార్డు

ఏర్పేడు, సెప్టెంబరు 27: నేషనల్ జియోస్పాటియల్ ప్రాక్టీషనర్ అవార్డును తిరుపతి ఐఐటీ నవావిష్కార్ ఫౌండేషన్ అందుకుంది. అలాగే తిరుపతి ఐఐటీ టెక్నాలజీ ఇన్నోవేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ రోషన్ శ్రీవాత్సవ్ ప్రతిష్ఠాత్మకమైన నేషనల్ జియో స్పాటియల్ ఫ్యాకల్టీ ఫెలో అవార్డును అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ, ఫోస్సీ ఐఐటీ బాంబే ద్వారా (ఎన్ఎంఈఐసీటీ) ఆధ్వర్యంలో అవార్డు అందజేశారు. డాక్టర్ రోషన్ శ్రీవాస్తవ్ విద్యా వ్యవస్థ, పారిశ్రామిక రంగానికి చేసిన విలువైన సూచనలు, అసాధారణ కృషికి గుర్తింపుగా ఈ అవార్డును అందించారు. బెంగళూరు ఐఐఎస్‌సీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ అనురాగ్ కుమార్ చేతులమీదుగా అవార్డును రోషన్ శ్రీవాత్సవ్ అందుకున్నారు. ఈ ఫౌండేషన్ సాంకేతిక అభివృద్ధి, వ్యాపారవేత్తలను ప్రోత్సహించడంలో గణనీయమైన పాత్రను పోషించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, ఐఐటీ అధికారులు పాల్గొన్నారు.


నేషనల్ జియోస్పాటియల్ ప్రాక్టీషనర్ అవార్డు అందిస్తున్న అనురాగ్‌కుమార్

యువ ఆపద మిత్ర శిక్షణకు పేర్లను నమోదు చేసుకోండి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 27: జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ యువ ఆపద మిత్ర పథకం ప్రవేశ పెట్టిందని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యాలయ కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. 18-40 సంవత్సరాల లోపు రోవర్లు, రేంజర్ల దీనికి పేర్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సమీప ప్రాంతాల్లో ప్రకృతి వైపరీత్యాలు జరిగిన సమయంలో సహాయక చర్యల్లో పాల్గొనే విధంగా ఏడు రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. రూ.10వేలు విలువైన అత్యవసర పరికరాల కిట్, 3సంవత్సరాల లైఫ్ అండ్ హెల్త్ బీమా ఇస్తారని తెలిపారు. ఈ నెల 30లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు నెం.9963981617లో సంప్రదించాలని తెలిపారు.

బాధ్యతలు, హక్కులపై శిక్షణ

వరదయ్యపాళెం, సెప్టెంబరు 27: వరదయ్యపాళెం పాఠశాలలో శుక్రవారం ప్రజాప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, సభ్యులకు బాధ్యతలు, హక్కులపై శిక్షణాకార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో సరస్వతి మాట్లాడుతూ ఎస్ఎంసీ సభ్యులకు ఉన్న హక్కులు, బాధ్యతలను గురించి వివరించారు. అదే విధంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమస్యలు గురించి సమావేశాల్లో చర్చించి వాటిని పరిష్కరించాలన్నారు. ఎంఈవో గున్నయ్య, ప్రజాప్రగతి ట్రస్టు సభ్యులు సుబ్రహ్మణ్యం, చెంచురామిరెడ్డి, ఓంకార్, సుస్మిత, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

దర్గాను సందర్శించిన ఎమ్మెల్సీ సిపాయి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 27: పట్టణంలోని స్వర్ణముఖి నది సమీపంలో ఉన్న హజరత్ క్వాజా సయ్యద్ షా జుంలేషాపీర్ ఖాదిరివల్లీ అల్లా దర్గాలో ఉరుసు వార్షిక గంధోత్సవం ప్రారంభమైంది. దర్గా వద్ద నిషాన్ జెండా ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం శుక్రవారం దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా పెద్దలు, ఉరుసు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీ అదృశ్యం


లింగప్ప

రేణిగుంట, సెప్టెంబరు 27: రేణిగుంట రైల్వేస్టేషనల్‌లో వ్యవసాయ కూలీ అదృశ్యమయ్యాడు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలు... కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం కసాపురానికి చెందిన కురువ లింగప్ప(45) వ్యవసాయ కూలీ. కుటుంబంతో గత నెల 13న శ్రీవారి దర్శనానికి వచ్చారు. తిరిగి 14న రేణిగుంట రైల్వేస్టేషన్‌లో ముంబై ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలో కుటుంబ సభ్యులు ఎక్కారు. అయితే లింగప్ప కనిపించలేదు. ఈక్రమంలో ఆయన కనిపించకపోవడంతో శుక్రవారం రేణిగుంట రైల్వేపోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ బాధ్యతల స్వీకరణ

పిచ్చాటూరు, సెప్టెంబరు 27: సత్యవేడు గ్రామీణ నీటి పారుదల శాఖ డివిజన్ ఇంజనీర్‌గా శైలజకుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్వేటినగరం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈగా పని చేస్తున్న శైలజకుమారి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ డీఈగా పని చేస్తున్న మురళీధర్‌ని నంద్యాల జిల్లా ఆళ్ళగడ్డకు బదిలీ చేశారు.

పిచ్చాటూరు ఏపీఎంగా చంద్రకళ

పిచ్చాటూరు మండలం మహిళా సమాఖ్య ఏపీఎంగా ఎస్.చంద్రకళ, సీసీలుగా సుబ్రహ్మణ్యం, నాగేంద్ర కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఏపీఎం వనిత పుత్తూరు రూరల్‌కు, పులికుండ్రం క్లస్టర్ సీసీ పరశురాం విజయపురానికి, రామాపురం క్లస్టర్ సీసీ ఉష కార్వేటినగానికి బదిలీ అయ్యారు.

అడవి కొడియంబేడులో స్వచ్ఛతాహి సేవా

పిచ్చాటూరు, సెప్టెంబరు 27: మండలంలోని అడవికొడియంబేడులో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కిరణ్‌కుమార్ నాయుడు పరిసర ప్రాంతాలను శుభ్రపరచుకోవాలన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్‌నాయుడు, తెలుగుదేశం నాయకులు భక్తవత్సలం, రవి, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, సంఘమిత్ర పాల్గొన్నారు.

బస్సు, ఆటో ఢీ: ఐదుగురికి గాయాలు




శ్రీకాళహస్తి, సెప్టెంబరు 27: ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్న ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. శ్రీకాళహస్తి పట్టణం తెట్టు కూడలి సమీపంలో సున్నపు అరుంధతివాడ వద్ద ఈ ప్రమాదం జరిగింది. శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు... పట్టణంలోని కాగితాల అరుంధతివాడ కు చెందిన వెంకటాచలం ఆటో నడుపుతుంటాడు. బజారు నుంచి జైహింద్‌పురం వద్దకు ప్రయాణికులతో వెళ్తుండగా సున్నపు అరుంధతివాడ వద్ద వాకాడు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఢీకొన్నాయి. ఈఘటనలో డ్రైవర్ వెంకటాచలం, ఇందిర, సుగుణ విజయ, చిన్నక్క గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చిన్నక్క, ఇందిరను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. వాహనాలను రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భానుప్రకాష్‌రెడ్డికి పలువురి శుభాకాంక్షలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 27: బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. ఆయన్ను తిరుపతిలో కలిసి ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఇలాంటి జన్మదినాలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

వరదయ్యపాళెంలో మోస్తరు వర్షం



వరదయ్యపాళెం, సెప్టెంబరు 27: మండలంలో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడటంతో కాసేపు జన జీవనానికి అంతరాయం ఏర్పడింది. పలు లోతట్టు ప్రాంతాలు కాస్త జలమయం అయ్యాయి. కాగా ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది.

దసరా ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 27: పట్టణంలోని బజారు వీధిలో కొలువై ఉన్న కన్యకా పరమేశ్వరి ఆలయంలో అక్టోబరు 3 నుంచి 13వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఆర్యవైశ్యులు ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ముందుగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి పాదాలచెంత ఉన్న ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

వేడుకగా పద్మావతమ్మ ఊంజలసేవ



నారాయణవనం, సెప్టెంబర్ 27: నారాయణవనంలో కొలువై ఉన్న కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు శుక్రవారం సందర్భంగా నిత్య కైంకర్యాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ఊంజల సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శుక్రవారం ఉత్సవం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 27: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మ వారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువు తీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మున్సిపల్ మాజీ చైర్మన్‌కు ఘన నివాళి



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 27: పురపాలక సంఘ మాజీ చైర్మన్ పేట రాధారెడ్డి 7వ వర్ధంతిని టీడీపీ నాయకులు నిర్వహించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సమాధి వద్ద సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ మాట్లాడుతూ రాధారెడ్డి పురపాలకసంఘ చైర్మన్‌గా ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం అన్నదానం చేశారు. గాలి మురళీనాయుడు, కంఠా రమేష్, పాపిరెడ్డి, ఉమేష్‌రావు, వి.కిషోర్, రాధారెడ్డి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సుప్రీంకోర్టు సీజే రాక

- రేపు జాయింట్ పార్లమెంటు కమిటీ జిల్లా పర్యటన


అధికారులతో సమీక్షిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 27: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ ధనంజయ వై చంద్రచూడ్ శనివారం జిల్లాకు వస్తున్నట్లు జేసీ శుభం బన్సల్ తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన అధికారులతో సమీక్షించారు. సుప్రీంకోర్టు సీజే శనివారం చేరుకుని.. ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుగు పయనం అవుతారన్నారు. అదే విధంగా జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఆదివారం జిల్లా పర్యటనకు రానుందన్నారు. ఇక అక్టోబరు 1 నుంచి 8వ తేదీ వరకు జిల్లాలో నేషనల్ లెవల్ మానటరింగ్ బృందం పర్యటిస్తుందని చెప్పారు. వీరిరాక సందర్భంగా భద్రత, ప్రొటోకాల్, విమానాశ్రయం వద్ద స్వాగతం, వీడ్కోలు తదితర ఏర్పాట్లు విధులు కేటాయించిన అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, ప్రొటోకాల్ ఎస్డీఈసీ చంద్రశేఖర్‌నాయుడు, అధికారులు ఆదిశేషారెడ్డి, శ్రీహరి, రవిప్రభు, శ్రీనివాసప్రసాద్, ప్రభావతి, సుశీలాదేవి పాల్గొన్నారు.

పల్లికొండేశ్వరాలయ ఈవోగా లత



నాగలాపురం, సెప్టెంబరు 27: సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయ నూతన ఈవోగా లత శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఈవో గుడిమల్లంకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బాధ్యతలు స్వీకరించిన లత... ఈ ఆలయంతో పాటూ పిచ్చాటూరు మండలంలోని రామగిరి వాలీశ్వర స్వామి ఆలయ ఇన్‌చార్జి ఈవోగా వ్యవహరి స్తారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి ప్రత్యేక చొరవ తీసుకుంటానని చెప్పారు.

శ్రీవారిని అపవిత్రం చేయాలంటే ఊరుకోం


సమావేశంలో మాట్లాడుతున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 27: తిరుమలేశుడిని అపవిత్రం చేయాలంటే చూస్తూ ఊరుకోమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ హెచ్చరించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... శ్రీవారి లడ్డూను అపవిత్రం చేసిన మాజీ సీఎం జగన్ స్వామివారిని దర్శించుకునే అర్హత లేదన్నారు. డిక్లరేషన్ ఇచ్చిన తరువాతనే దర్శనానికి వెళ్లాలన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అనేక ఆలయాల్లో అవినీతి, అక్రమాలు, రథాలు దహనం, దేవతామూర్తుల విగ్రహాల ధ్వంసం మొదలైన సంఘటనలు వెలుగు చూశాయన్నారు. కల్తీ నెయ్యితో తయారు చేసిన లడ్డూలతో భక్తుల మనోభావాలు దెబ్బతీసిన జగన్‌ను ప్రజలు క్షమించరన్నారు. ఎం.సుబ్రహ్మణ్యంరెడ్డి, జి.రమేష్‌బాబు, అమర్‌నాథ్, కె.గోవర్ధన్, ఎస్వీ రమణ తదితరులు పాల్గన్నారు.

జాగ్రత్త గోవిందా!


ప్రకాష్‌నాయుడు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 27: శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా అనేక అక్రమాలకు పాల్పడి చివరకు పవిత్రంగా భావించే లడ్డూలో కూడా కల్తీ నెయ్యితో కలుషితం చేసిన మాజీ సీఎం జగన్ వస్తున్నాడు... గోవిందుడు జాగ్రత్తగా ఉండాలని తెలుగురైతు నాయకుడు ప్రకాష్ నాయుడు హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ టీటీడీని ఏటీఎంగా మార్చిన జగన్‌రెడ్డి బృందం తిరుమలకు విచ్చేసి డిక్లరేషన్ చేయకుండా స్వామివారిని దర్శించు కోవాలను కోవడం భక్తులను అవమానించినట్లే అన్నారు. హిందూ దేవుళ్ల పాలిట దెయ్యంలా మారి విగ్రహాల ధ్వంసం, రథాల దహనం, ఆలయాలపై దాడులు వంటి వికృత చేష్టలకు పాల్పడుతూ కులాల మధ్య మాజీ సీఎం చిచ్చు పెడుతున్నారన్నారు.

నాయకులకు పోలీసు నోటీసులు

వరదయ్యపాళెం/ ఏర్పేడు, సెప్టెంబరు 27: మాజీ సీఎం జగన్ తిరుమల పర్యటన నేపథ్యంలో శుక్రవారం వరదయ్యపాళెం మండలంలోని పలువురు వైసీపీ నాయకులకు పోలీసులు నోటీసులు అందజేశారు. మాజీ సీఎం జగన్ తిరుమల పర్యటన నేపథ్యంలో శుక్రవారం ఏర్పేడు పోలీసులు టీడీపీ, వైసీపీ నేతలకు ముందస్తుగా నోటీసులు అందించారు. ఎక్కడా వివాదం జరగకుండా ముందస్తుచర్యల్లో భాగంగా ఇరుపార్టీల వారికి నోటీసులు ఇచ్చారు.

అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 27: పంచాయతీ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు కోరారు. మండలంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు, స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్‌పై శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఇప్పటి వరకు పంచాయతీలో జరిగిన అభివృద్ధిపై ప్రజలకు వివరించారు. సర్పంచ్ వెంకటమ్మ, ఉప సర్పంచ్ మనిరాజా, కార్యదర్శి ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

30న మహాజన సభ

నారాయణవనం, సెప్టెంబర్ 27: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో ఈ నెల 30న ఉదయం 11 గంటలకు మహాజన సభను నిర్వహిస్తున్నట్లు అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి నిరంజన్ బాబు, సీఈవో బాలసుబ్రమణ్యం తెలిపారు.